
# పౌరహక్కుల ఉద్యమంపైన ఈ దాడులెందుకు?




ప్రతిరోజూ పేపర్లలో పౌరహక్కుల సంఘం ప్రకటనలు, లేక పౌరహక్కుల సంఘాన్ని దూషిస్తూ ఎవరో ఇచ్చిన ప్రకటనల చూస్తుంటారు. మా ప్రకటనలు సాధారణంగా పోలీసులనూ, ప్రభుత్వాన్నీ, సమాజంలోని పెత్తందారీ వర్గాలనూ విమర్శిస్తుంటాయి. వాళ్లు తమ విధి నిర్వహణ చట్టబద్ధంగా చేయడం లేదనీ, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనీ, ఉద్యమాలను అణచివేస్తున్నారనీ, బలహీనులపైన దాడులు చేస్తున్నారనీ మేము విమర్శిస్తుంటాము. ఆ విమర్శకు ఎవ్వరూ ఏ రోజూ జవాబు చెప్పరు. జవాబు చెప్పే బదులు మమ్మల్ని దూషిస్తారు. అరెస్టు చేస్తారు. తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తారు. అప్పుడప్పుడు మమ్మల్ని చంపుతుంటారు కూడ.

న్యాయవాది గోపిరాజన్నను 1985 జనవరి 12న కరీంనగర్ జిల్లా జగిత్యాలలో భారతీయ జనతా పార్టీ వాళ్ళు తుపాకులతో కాల్చిచంపారు. గోపిరాజన్న ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం జగిత్యాల తాలూకా శాఖ ఉపాధ్యక్షుడు.

పిల్లల డాక్టరు ఎ.రామనాథంను 1985 సెప్టెంబర్ 3న వరంగల్ పట్టణంలో సాయుధ పోలీసులు ఊరేగింపుగా వచ్చి ఆయన క్లినిక్ పైన దాడి చేసి కాల్చి చంపారు. డాక్టర్ రామనాథం ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షుడు.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

## పౌరహక్కుల ఉద్యమం అంతర్జాతీయ ఉద్యమం

మేము చెప్పున్నవి కేవలం ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం అభిప్రాయాలు కావు. అంతర్జాతీయ పౌరహక్కుల ఉద్యమం అభిప్రాయాలు.

మనదేశంలోని అన్ని రాష్ట్రాలలో పౌరహక్కుల సంస్థలు ఉన్నాయి. అన్ని దేశాలలోనూ ఉన్నాయి. అన్ని పౌరహక్కుల సంస్థలూ అణచివేతకు వ్యతిరేకంగా పుట్టినవే. కొన్ని సామాజిక వర్గాలను లేక రాజకీయ ఉద్యమాలను ప్రజాస్వామిక విలువలకు వ్యతిరేకంగా అణచివేస్తుంటే దానికి స్పందించి ప్రజాస్వామిక విలువలను నిలబెట్టడం కోసం ఏర్పడ్డాయి పౌరహక్కుల సంస్థలు.

అమెరికాలో ఈ శతాబ్దం రెండవ దశకంలో కమ్యూనిస్టు భావాలు కలవాళ్లను ప్రభుత్వం వేటాడి అరెస్టు చేసి కేసులలో ఇరికించింది. రాజకీయ స్వేచ్ఛను నిరాకరించడం, తప్పుడు కేసులలో ఇరికించడం అన్యాయమంటూ పుట్టింది అమెరికా పౌరహక్కుల సంఘం (ఎసిఎల్‌యు). చైనాలో 1926లో షాంగై తిరుగుబాటును ప్రభుత్వం పాశవికంగా అణచివేసిన తరువాత రైతాంగ ఉద్యమకారులనూ కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరులనూ ఏరివేస్తుంటే అందుకు నిరసనగా ఏర్పడింది చైనా లీగ్ ఫర్ సివిల్ రైట్స్. బ్రిటన్‌లో 1930లో తీవ్రంగా నెలకొన్న నిరుద్యోగం, ఆకలి, దారిద్ర్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన కార్మిక వర్గాన్ని ప్రభుత్వం పాశవికంగా అణచివేస్తుంటే అందుకు నిరసన తెలుపుతూ, ఉద్యమించే హక్కుకు మద్దతుగా ఏర్పడింది బ్రిటిష్ జాతీయ పౌరహక్కుల సమితి (ఎన్‌సిసిఎల్). భారత జాతీయ ఉద్యమాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధాజ్ఞలూ, లాఠీచార్జీలూ, కాల్పులతోనూ, రాజద్రోహం కేసులతోనూ అణచివేయాలని చూసినప్పుడు దానిని ప్రతిఘటించడానికి కాంగ్రెస్ పెద్దల సారథ్యంలో పుట్టింది భారత పౌరహక్కుల సంస్థ. దీనికి నెహ్రూ, రవీంద్రనాథ్ టాగూర్, రాంమనోహర్ లోహియా వంటివారు నాయకత్వం వహించారు. సోవియట్ రష్యా, తూర్పు యూరోప్, చైనా తదితర దేశాల కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాలు తమ విధానాల పట్ల అసమ్మతి తెలిపే హక్కును నిరాకరించి అసమ్మతి వాదులను అణచివేతకు గురిచేసినప్పుడు దానికి నిరసనగా ఒక్కొక్క దేశంలోనూ పౌరహక్కుల సంస్థలు ఏర్పడ్డాయి. వాటిలో పేరుపొందినది జెకోస్లోవేకియాకు చెందిన 'చార్టర్ ఆఫ్ 77'. దక్షిణ అమెరికా దేశాల సైనిక నియంతల రాక్షసపాలనకు వ్యతిరేకంగా అన్ని దేశాలలోనూ పౌరహక్కుల సంస్థలు ఏర్పడ్డాయి. అమెరికాలోనూ, దక్షిణ ఆఫ్రికాలోనూ నల్లజాతివారు తమకసలు పౌరులుగా గుర్తింపే లేదంటూ ఉద్యమాలలో ముందుకొచ్చారు.

అణచివేతకు వ్యతిరేకంగా ఏర్పడిన పౌర హక్కుల సంస్థలు కాలక్రమంలో తమ పరిధినీ అవగాహననూ విస్తరించుకొని ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నాయి. అంతర్జాతీయమయిన ఈ ఉద్యమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంకూడ అదే కృషి చేస్తూ ఉంది.

**ఆర్టికల్ 13 (2) :** ఈ (ప్రాథమిక హక్కుల) అధ్యాయంలో హామీ యిచ్చిన హక్కులను కుదించే చట్టాలను కానీ అతిక్రమించే చట్టాలనుకానీ ప్రభుత్వం చేయడానికి వీలు లేదు. అటువంటి చట్టాలు చెల్లవు.

**ఆర్టికల్ 32 (2) :** ఈ (ప్రాథమిక హక్కుల) అధ్యాయంలోని హక్కుల అమలు కోసం ప్రభుత్వానికి ఆదేశాలు ('రిట్‌లు) జారీచేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉంది.

**ఆర్టికల్ 226 :** ప్రాథమిక హక్కుల అమలు కోసం, ఇతర చట్టపరమయిన హక్కుల అమలుకోసం ఆదేశాలు ('రిట్‌లు) జారీచేసే అధికారం హైకోర్టుకు కూడ ఉంది.

**ఆర్టికల్ 37 :** ఈ (ఆదేశిక సూత్రాల) అధ్యాయంలోని అంశాలను అమలు చేయించే అధికారం కోర్టులకు లేకపోయినప్పటికీ, వీటిలోని సూత్రాలు దేశపాలనలో మౌలిక ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. ప్రభుత్వం చట్టాలు చేసేటప్పుడు వీటిని విధిగా అనుసరించాలి.

నిజాం వ్యతిరేక పోరాటకాలం నుండి ప్రజాతంత్ర పోరాటాలలో పాల్గొన్న ప్రజాస్వామ్యవాది జాపాలక్ష్మారెడ్డిని 1986 నవంబర్ 7న కరీంనగర్ జిల్లాలోని అల్లునూరు గ్రామంలో తన ఇంట్లోనే పోలీసులు కాల్చి చంపారు. జాపాలక్ష్మారెడ్డి ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు.

న్యాయవాది, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి, తన స్వగ్రామానికి సర్పంచ్ అయిన నర్రా ప్రభాకరరెడ్డిని 1991 డిసెంబర్ 7న వరంగల్‌లోని ఆయన స్వగృహంలో పోలీసులు కాల్చి చంపారు. ప్రభాకరరెడ్డి ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం వరంగల్ జిల్లా శాఖ కన్వీనర్.

గత ఆరేళ్లలో మా సంస్థ సభ్యులు అనేకమందిని తప్పుడు అభియోగాలతో పోలీసులు అరెస్టు చేసారు. మా మీద హత్య కేసులుపెట్టారు. 'టాడా' చట్టం మోపారు బాంబులు పంచుతున్నామన్నారు. తుపాకులతో ప్రభుత్వాన్ని కూల దోస్తున్నామన్నారు. రాజద్రోహానికి పాల్పడ్డామన్నారు.

వెరసి, మేము చాలా ప్రమాదకరమయిన మనుషులమని ఈ ప్రభుత్వం అంటుంది.

మేము బాంబులను చూసి ఎరుగం. తుపాకులు పోలీసుల దగ్గర తప్ప వేరే ఎక్కడా చూడలేదు. మేమంతా ఉద్యోగాలు చేసుకొని బ్రతికే మధ్య తరగతి బుద్ధిజీవులం. న్యాయవాదులం, అధ్యాపకులం, డాక్టర్లం, విలేకరులం, గుమాస్తాలం. ప్రభుత్వ యంత్రాంగం చట్టం ప్రకారం నడవాలనీ, పోలీసులు విధి నిర్వహణ పేరిట ప్రజలను చంపరాదనీ, పాలకులు ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలనీ, స్త్రీలపైన, దళిత కులాలపైన, కూలి చేసుకొని బ్రతికే పేదలపైనా అత్యాచారాలు అరికట్టాలనీ నిత్యం మీటింగులు పెట్టి కరపత్రాలు వేసి పత్రికా ప్రకటనలు చేసి కోర్టులో కేసులు వేసి ఘోషించే సంఘం మాది.

చాలా నిరపాయకరమయిన మనుషులుగా కనిపిస్తున్నామా? అవుననే మాకూ అనిపిస్తూ ఉంది.

మరి మాపైన ఈ దాడులు ఎందుకు?

# మేము ఏమంటున్నాము?

ఒక్కొక్కటీ చెప్తాము.

**రాజ్యాంగ హక్కులు, ఆదేశాలు:** రాజ్యాంగాన్ని కాపాడతానంటూ అధికారం చేపట్టిన ప్రభుత్వం ఆ రాజ్యాంగంలో హామీ ఇచ్చిన హక్కులనూ, ఆదర్శాలనూ గౌరవించి పరిపాలించాలంటున్నాము.

పాలకులు అందుకు భిన్నంగా నడచుకుంటున్నారు. రాజ్యాంగం తమకిచ్చిన అధికారాలను వాడుకుంటున్నారు. అవి ప్రజావ్యతిరేకంగా ఉన్నా తటపటాయించకుండా వాడుకుంటున్నారు. కానీ రాజ్యాంగం ప్రజలకు హామీ ఇచ్చిన హక్కులనూ, ఆదర్శాలనూ మాత్రం అమలు చేయడం లేదు. దీనిని మేము విమర్శిస్తున్నాము.

అది తప్పా?

భారత రాజ్యాంగం 3వ అధ్యాయంలో ప్రాథమిక హక్కుల జాబితా ఉంది. ఇవన్నీ తప్పక ప్రభుత్వం గౌరవించవలసిన హక్కులు. తప్పక అమలు చేయవలసిన హక్కులు. ప్రభుత్వం అమలు చేయకపోతే కోర్టులు అమలు చేయించవలసిన హక్కులు. ఈ ప్రాథమిక హక్కుల జాబితా ఏమంటుందో చూద్దాం.

చట్టం ముందు అందరూ సమానమే. చట్టం అందరికీ సమాన సంరక్షణ కల్పించాలి (ఆర్టికల్ 14). కులం, జాతి, భాష, ప్రాంతం, లింగం, మతం అనే వివక్ష చెల్లదు (ఆర్టికల్స్ 15, 16). అంటరానితనం ఏ రూపంలోనూ పాటించడానికి వీలు లేదు (ఆర్టికల్ 17). దేశంలో అందరికీ వాక్ సభా స్వాతంత్ర్యాలున్నాయి. అభిప్రాయాలు ప్రకటించే స్వేచ్ఛ ఉంది. సంఘాలు పెట్టుకునే హక్కు ఉంది (ఆర్టికల్ 19). నేరం ఒప్పుకొమ్మని ఎవ్వరినీ బలవంతం చేయడానికి వీలులేదు (ఆర్టికల్ 20(3)). ఎవ్వరి ప్రాణాన్నీ, స్వేచ్ఛనూ చట్టబద్ధంగా తప్ప ఇతరత్రా తీసివేయడానికి వీలు లేదు (ఆర్టికల్ 21). ఎవరినైనా పోలీసులు అరెస్టుచేస్తే వెంటనే కారణం చెప్పాలి. 24 గంటల లోపల కోర్టులో హాజరు పెట్టాలి (ఆర్టికల్ 22 (1)). ఎవరిచేతా వెట్టి చాకిరీ చేయించుకోవడానికి వీలు లేదు (ఆర్టికల్ 23). 14 సంవత్సరాల లోపు వయసున్న పిల్లల చేత ఫ్యాక్టరీలలో, గనులలో ఇతర ప్రమాదకర స్థలాలలో పని చేయించుకోవడానికి వీలు లేదు (ఆర్టికల్ 24).

ఇవీ ఇటువంటివీ ప్రాథమిక హక్కులు. వీటికి రాజ్యాంగమే అనేక మినహాయింపులూ షరతులూ పెట్టిన మాట వాస్తవమే. అయితే మినహాయింపు ప్రధానం కాదు. హక్కు ప్రధానం. ఈ హక్కులను ప్రజలు ఈ దేశంలోనూ. ఇతర దేశాలలోనూ పోరాటాలు చేసి, ప్రాణత్యాగం చేసి సాధించుకున్నారు. మినహాయింపులు ప్రభుత్వాలు పెట్టినవి.

భారత రాజ్యాంగం అధ్యాయం 4లో మరొక జాబితా ఉంది. దీనిని ఆదేశిక సూత్రాల జాబితా అంటారు. ఈ ఆదేశిక సూత్రాలు దేశపాలనలో 'మౌలిక ప్రాధాన్యత కలిగి ఉంటాయి' అని రాజ్యాంగమే అంటుంది. ఈ ఆదేశిక సూత్రాలననుసరించి ప్రభుత్వం తన ఆర్థిక సామాజిక విధానాలను రూపొందించాలని రాజ్యాంగం అంటుంది.

సంపద కొద్దిమంది చేతిలో కేంద్రీకృతం కాకూడదని ఆదేశిక సూత్రమయిన ఆర్టికల్ 39 అంటుంది. ఈ నాలుగు దశాబ్దాల అభివృద్ధి సరిగ్గా ఆ కేంద్రీకరణకే దారి తీసింది:
దేశజనాభాలో సంపన్నులయిన 20 శాతం అనుభవిస్తున్న జాతీయ ఆదాయం - 51 శాతం.
మిగిలిన 80 శాతం ప్రజలు తక్కిన 49 శాతం జాతీయ ఆదాయంతో సరిపెట్టుకుంటున్నారు.
గ్రామీణ ప్రజానీకంలో 55 శాతానికి నెలకు 100 రూ॥ల లోపు తలసరి ఆదాయం లభిస్తోంది.
మరి మనల్ని పరిపాలిస్తున్నది రాజ్యాంగబద్ధమయిన ప్రభుత్వమేనా?
దీనికి రాజ్యాంగం పేరిట మనల్ని శాసించే అధికారం ఉందా?

పి.వి. నరసింహారావు ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను సడలించడం అనే పేరుమీద చేపడుతున్న చర్యలు ఆర్టికల్ 39లోని ఆదేశాలకు పూర్తిగా భిన్నంగా లేవూ? ప్రభుత్వం ఆదేశిక సూత్రాలను తప్పనిసరిగా అనుసరించాలని చెప్పే ఆర్టికల్ 37కు ఇది విరుద్ధం కాదూ?
మరి ఇది రాజ్యాంగ బద్ధమయిన ప్రభుత్వమేనందామా?

ఆర్టికల్ 39 A ఏమంటుందో చదివారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ ప్రశ్న అడగండి. పేదప్రజలకు ఉచిత న్యాయసహాయం అందియ్యడం తన జీవిత ఆశయంగా పెట్టుకున్న పౌరహక్కుల న్యాయవాది న్రా. ప్రభాకరరెడ్డిని ఎందుకు హత్య చేశారు?

'పాఠశాలలు, ఆస్పత్రులు ప్రభుత్వరంగంలో నడపడం ఇంకమీదట సాధ్యపడదు. వాటిని ప్రైవేట్ రంగానికి వదిలేస్తున్నాం'

– రాష్ట్ర ముఖ్యమంత్రి

అంటే చదువు, వైద్యం డబ్బు పెట్టి కొనుక్కోవలసిందే.
ప్రభుత్వం ఒక హక్కుగా కల్పించదు.
ఇది ఆర్టికల్ 41కి విరుద్ధం కాదూ?
మరి నేదురుమల్లి జనార్దనరెడ్డి పాలన రాజ్యాంగబద్ధమయిన పాలనే అందామా?
రాజ్యాంగాన్ని గురించి ఇతరులకు నీతులు చెప్పే అర్హత ఈ ప్రభుత్వానికి ఉందందామా?

రాజ్యాంగం ఆర్టికల్ 45లో ఇచ్చిన గడువుకు మూడురెట్లు గడిచింది. దేశంలో నిరక్షరాస్యుల జనాభా 60 శాతం ఉంది. స్త్రీలలో దాదాపు 75 శాతం ఉంది. 'నిర్బంధంగా, ఉచితంగా' విద్య నేర్పించడం కోసం ప్రయత్నాలు మానేసి అక్షర కళాయాత్ర పేరిట సంబరాలు నడుపుతున్నారు.
మరి ఇది రాజ్యాంగబద్ధమయిన ప్రభుత్వమేనా?

మత్తుపదార్థాలను నిషేధించాలని ఆర్టికల్ 47 అంటుంది. ఆ పనిచేయకపోగా దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సారాయి పెద్ద ఎత్తున ప్రజలకు అమ్మి డబ్బు చేసుకుంటున్నాయి. మన రాష్ట్రప్రభుత్వానికి ఈ రకంగా వస్తున్న ఆదాయం దాదాపు 800 కోట్లు. అమ్మకపు పన్ను తరువాత ఇదే రాష్ట్రప్రభుత్వానికి ప్రధాన ఆదాయం. తెలంగాణా జిల్లాలో ఈ సంవత్సరం తుపాకుల పహారాలో సారాయి అమ్ముతున్నారు.
మరి ఇది రాజ్యాంగ బద్ధమయిన ప్రభుత్వమేనా?

ఇందులో ముఖ్యమైనవి:

ప్రభుత్వం తన విధాన రచన చేసేటప్పుడు ఈ క్రింది అంశాలను లక్ష్యంగా పెట్టుకోవాలి. పౌరులందరికీ (స్త్రీ పురుష భేదం లేకుండ) తగినంత జీవనాధారం పొందే హక్కు ఉండాలి. సమాజం యొక్క భౌతిక వనరులు అందరి ప్రయోజనాలనూ సాధించేరీతిలో పంపిణీ కావాలి. సంపద కొందరి చేతిలో కేంద్రీకృతమయి సమాజ ఉమ్మడి ప్రయోజనాలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడకూడదు. ఆర్థిక వ్యవస్థను ఆ విధంగా నడపకూడదు. స్త్రీ పురుషులకు సమాన పనికి సమాన వేతనం దక్కాలి. శ్రామికుల ఆరోగ్యాన్నీ శక్తినీ చిన్నపిల్లల పసివయస్సునూ ఎవ్వరూ దుర్వినియోగం చేయకుండ చూడాలి. తమ శక్తికీ వయసుకూ తగని పని చేసే అగత్యం ఎవ్వరికీ ఏర్పడకుండ చూడాలి. పిల్లలకు ఆరోగ్యంగా స్వేచ్ఛగా సగౌరవంగా ఎదిగే అవకాశం ఉండేలాగ చూడాలి (ఆర్టికల్ 39).

న్యాయవ్యవస్థ ముందు అందరికీ సమాన అవకాశాలు ఉండేలాగ చూడటం ప్రభుత్వం కర్తవ్యం. తద్వారా న్యాయం నిజంగా చేకూర్చాలి. ప్రత్యేకించి, ఆర్థికంగా ఇతరత్రా బలహీనులయిన వాళ్లకు సమాన అవకాశం కల్పించడం కోసం ఉచిత న్యాయ సహాయం ప్రభుత్వమే కల్పించాలి. (ఆర్టికల్ 39ఎ)

ప్రభుత్వానికి ఆర్థిక సామర్థ్యం ఉన్నమేరకు అందరికీ పని హక్కు, చదువుకునే హక్కు, ముసలితనంలోనూ అనారోగ్యంలోనూ నిరుద్యోగంలోనూ ప్రభుత్వ సహాయం పొందేహక్కు కల్పించే చర్యలు చేపట్టాలి (ఆర్టికల్ 41).

వ్యవసాయ పారిశ్రామిక తదితర రంగాలలోని కార్మికులందరికీ జీవనానికి సరిపోయే వేతనం లభించేటట్టు ప్రభుత్వం చూడాలి. గౌరవప్రదమయిన జీవన ప్రమాణాన్ని కల్పించాలి. విరామ సమయాన్ని సంతృప్తిగా అనుభవించే స్థితిగతులనూ సామాజిక సాంస్కృతిక అవకాశాలను వినియోగించుకోగల స్థితిగతులనూ కల్పించాలి. ప్రత్యేకించి, గ్రామీణ గృహపరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. (ఆర్టికల్ 43)

ఈ రాజ్యాంగం జారీ అయిన పది సంవత్సరాలలోగా పిల్లలందరికీ 14 సంవత్సరాల వయసు వచ్చేదాకా నిర్బంధంగా ఉచితంగా విద్యాబోధన సౌకర్యం లభించేటట్టు ప్రభుత్వం చూడాలి (ఆర్టికల్ 45).

సమాజంలోని బలహీన వర్గాల - ప్రత్యేకించి షెడ్యూల్డు కులాలు, తెగల - ఆర్థికపరమయిన అవసరాలనూ విద్యా వసరాలనూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ప్రోత్సహించాలి. వాళ్లను సామాజిక అన్యాయం నుండి అన్ని రకాల దోపిడీ నుండి కాపాడాలి (ఆర్టికల్ 46).

ప్రజల జీవన ప్రమాణాలనూ ప్రజారోగ్యాన్నీ ప్రజలకు లభ్యమయ్యే పోషకాహారాల పరిమాణాన్నీ పెంపొందించడం ప్రభుత్వం తన ప్రధాన బాధ్యతగా పరిగణించాలి. ప్రత్యేకించి మత్తు పానీయాలను ప్రమాదకరమయిన మాదక పదార్థాలనూ నిషేధించడానికి ప్రయత్నించాలి (ఆర్టికల్ 47).

ఇవన్నీ ప్రభుత్వం చేయాలని అంటున్నాం. ఇవన్నీ చేయకపోతే సమాజంలో ఆందోళనలూ అల్లర్లూ నేరాలూ పెరిగిపోతాయని అంటున్నాం. ఆ తరువాత అరాచకం ప్రబలిందంటూ ప్రజల మీద దాడి చేసి ప్రయోజనం లేదంటున్నాం. ఇప్పుడు అదే జరుగుతూవుంది కదా! సంపద కొద్దిమంది చేతిలో కేంద్రీకృతమవుతూ వుంది. సమాజానికి ప్రమాదంగా తయారవుతూ వుంది. చాలామందికి బ్రతకడానికి తగిన జీవనాధారం లేదు. పనికి తగ్గ వేతనం లేదు. సమానత్వం లేదు. సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం అసలే లేదు. దీని వలన అలజడులూ, అల్లర్లూ, సంఘటిత రాజకీయ పోరాటాలూ ముందుకొస్తున్నాయి. ప్రభుత్వం తన వైఫల్యాన్ని ఒప్పుకోలేక ప్రజలను నేరస్తులంటూ ఉంది. కొడుతూ ఉంది. చంపుతూ ఉంది. దీనిని మేము వ్యతిరేకిస్తున్నాం.

ఇది న్యాయమే కదా?

మరి మామీద ఈ దాడులెందుకు?

'రాయలసీమ బాంబుల సంస్కృతి పోవాలంటే ప్రజల మనస్సులలో మార్పులు రావాలి. సామాజిక పరిస్థితులు మారాలి. ప్రభుత్వం ఏం చేయగలదు?'

– పి.వి. నరసింహరావు

(నంద్యాలలో విలేకరులతో మాట్లాడుతూ)

చాలా బాగా చెప్పారు బహువిధ పండితులయిన ప్రధానిగారు. కానీ ఈ తత్వం మీ పార్టీ నాయకుల పోషణలో వర్ధిల్లుతున్న రాయలసీమ బాంబుల సంస్కృతికి మట్టుకే వర్తిస్తుందా, లేకపోతే దేశంలో ఎక్కడయినా 'ఉగ్రవాదం' 'తీవ్రవాదం' అని మీరు పేరుపెట్టి అణచివేస్తున్న ఉద్యమాలకు కూడ వర్తిస్తుందాండీ, ప్రధానమంత్రిగారూ?

## భారత రాజ్యాంగం నాందీ ప్రకటన

భారత ప్రజలమయిన మేము దేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్రంగా రూపొందించి, దేశపౌరులందరికీ
సామాజిక రాజకీయ ఆర్థిక న్యాయం
ఆలోచనలో,అభివ్యక్తిలో,నమ్మకాలలో,మతవిశ్వాసాలలో,పూజావిధానంలో స్వేచ్ఛ
స్థితిగతులలో, అవకాశాలలో సమానత్వం కలిగించడానికి
వ్యక్తికి గౌరవప్రదమయిన జీవితాన్నీ
జాతికి ఐక్యతనూ సమగ్రతనూ సమకూర్చే సౌభాతృత్వాన్ని పెంపొందించడానికి
మా రాజ్యాంగ పరిషత్తులో ఈ దినం ఈ రాజ్యాంగాన్ని ఆమోదించి సమర్పించుకుంటున్నాము.

## 'రాజ్యాంగం మీద నమ్మకం లేని వాళ్లకు రాజ్యాంగ హక్కులు వర్తించవు'

-అనేక మంది,మేధావులు

1. రాజ్యాంగంలో ఆ మాట ఎక్కడా అనలేదు.
2. రాజ్యాంగంలోని హక్కులు ఒకరు భిక్షగా ఇచ్చినవికావు. ప్రజలు అన్ని దేశాలలోనూ పోరాడి సాధించుకున్నవి. అవి ప్రజలకు ఎప్పుడూ వర్తిస్తాయి.
3. రాజ్యాంగం మీద అసలు నమ్మకంలేని వాళ్లు ఈ దేశాన్ని ఏలుతున్నవాళ్లు. మంత్రులు, అధికారులు, పెట్టుబడిదారులు, భూస్వాములు, పోలీసులు - వీళ్లెవ్వరికీ రాజ్యాంగం మీద నమ్మకంలేదు. మరి వాళ్లకు కూడ హక్కులు లేవనీ, వాళ్లను కూడ విచారణ లేకుండ కాల్చిపారేయవచ్చుననీ ఒప్పుకుంటారా?

## 'పోలీసులు పౌరులు కారా?

-పోలీస్ అధికారులు (ముక్తకంఠంతో)

ఇన్నేళ్లగా మేము అదే ప్రశ్న అడుగుతున్నాం. ఇప్పుడు మీకు కూడ తోచినందుకు సంతోషిస్తున్నాం. పోలీసులు పౌరులు కారా? వాళ్లకు చట్టాలు వర్తించవా? వాళ్లు నంబర్‌లేని జీపులలో తిరగవచ్చునా? డ్రెస్‌లేకుండ డ్యూటీ చేయవచ్చునా? కొట్టవచ్చునా, చంపవచ్చునా, పీడించి డబ్బులు తినవచ్చునా? దేనికీ శిక్ష ఎందుకు ఉండదు? వాళ్లు నేరాలు చేస్తే దానిని విధి నిర్వహణ అని ఎందుకంటారు? వాళ్లు హత్య చేస్తే దానిని 'ఎన్‌కౌంటర్' అని ఎందుకంటారు?
ఈ ప్రశ్నలకు జవాబు చెప్తే పోలీసులు పౌరులో కాదో నిర్ణయిస్తాం.

## 1984 నుండి రాష్ట్రంలో లాకప్పుహత్యల చిట్టా

| సంవత్సరం | మృతులసంఖ్య |
|---|---|
| 1984 | 24 |
| 1985 | 16 |
| 1986 | 20 |
| 1987 | 24 |
| 1988 | 20 |
| 1989 | 14 |
| 1990 | 12 |
| 1991 | 21 |
| | 151 |

ఇన్నిలాకప్ హత్యలకు ఎంత మందికి శిక్ష పడింది? ఎన్ని కేసులు కోర్టులో విచారణకు వచ్చాయి?

| | |
|---|---|
| ప్రభుత్వమే కోర్టులో పెట్టిన కేసులు | 2 |
| న్యాయవిచారణ ఫలితంగా కోర్టుకు వచ్చినవి | 3 |

పోలీసులు పౌరులుకారా? వాళ్లు హత్యలు చేస్తే అవి హత్యలు కావా?

**అంతర్జాతీయ ప్రకటనలు** భారత ప్రభుత్వానికి ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వముంది. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలకూ, ప్రకటనలకూ కట్టుబడి ఉండడం భారత ప్రభుత్వం నైతిక బాధ్యత. ఐక్యరాజ్య సమితి మానవ హక్కులు, పౌర రాజకీయ హక్కులు, సామాజిక ఆర్థిక సాంస్కృతిక హక్కులు అనే పేరుతో అనేక ప్రకటనలు చేసింది, ఒడంబడికలు రూపొందించింది.

1948 లో ప్రామాణికమయిన అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనను ఆమోదించింది. ఈ ప్రకటన మీద భారత ప్రభుత్వం సంతకం చేసింది. అందులోని వివిధ అంశాలను వేరువేరుగా క్రోడీకరిస్తూ 1962లో ఐక్యరాజ్య సమితి పౌరరాజకీయ హక్కుల ఒడంబడిక, ఐక్యరాజ్య సమితి సామాజిక ఆర్థిక సాంస్కృతిక హక్కుల ఒడంబడిక అనే రెండు ఒడంబడికలను రూపొందించింది. వీటిని కూడ భారత ప్రభుత్వం ఆమోదించింది. వీటి అమలును గురించి ఆయా ప్రభుత్వాలను ప్రశ్నించడం కోసం ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిటీ ఒకటి ఏర్పడింది.

ఒక వైపు ఐక్యరాజ్య సమితిలో కూర్చొని వీటన్నిటి మీదా అన్ని ప్రభుత్వాలూ సంతకం చేస్తూనే, మరొక వైపు తమ దేశాలలో ప్రజలను, అందులోనూ మిలిటెంట్ రాజకీయ ప్రత్యర్థులను అణచివేతకు గురిచేస్తూ వచ్చాయి. నేరారోపణ లేకుండ ఖైదు చేయడం, నేరవిచారణ నిష్పాక్షికంగా జరపకుండ శిక్షించడం, కాల్చిపారేసి 'ఎన్‌కౌంటర్' జరిగిందని ప్రకటించడం, లాకప్పులో కొట్టి చంపి శవాన్ని మాయం చేయడం, చిత్రహింసలు పెట్టి నేరాలు ఒప్పించడం, రాజకీయంగా లొంగదీసుకోవడం, అన్ని దేశాలలోనూ పరిపాటి అయింది. ఇందులో ఒక్కొక్క అంశం మీద ఐక్యరాజ్య సమితి వర్కింగ్ గ్రూప్‌లను నియమించి అధ్యయనం చేసి, 1985లో 'నిర్బంధితుల సంరక్షణ కోసం ఉద్దేశించిన మౌలిక సూత్రాలు' రూపొందించింది. వీటిని కూడ అన్ని సభ్య దేశాలతో పాటు భారతదేశం ఆమోదించింది.

వీటిని అమలు చేయమని మేము అడుగుతున్నాం. అమలు చేయకపోతే విమర్శిస్తున్నాం. అది తప్పు కాదు కదా?

మరి మా మీద ఈ దాడులెందుకు?

**పోలీసు యంత్రాంగం:** నిన్న రాత్రి ఫలాన వ్యక్తిని పోలీసులు అరెస్టుచేసి లాకప్పులో పెట్టారనీ, పొద్దున్న లేచి చూసేసరికి అతను తన లుంగీతోనే ఉరిపెట్టుకొని/ప్రమాదకరమయిన విషం మింగి/తన గొంతు తానే గాజుపెంకుతో కోసుకొని/గుండె అకస్మాత్తుగా పగిలి/కాలేయం పనిచేయడం మానేసి - ఎట్లాగయితేనేం, చచ్చి శవమయి ఉన్నాడని పోలీసులు ప్రకటించడం తరుచుగా చూస్తుంటాం.

ఇందులో నూటికి 95 శాతం కట్టు కథలు. సమాచారం రాబట్టడం కోసం, లంచం కోసం, లంచం ఇచ్చిన ప్రత్యర్థుల పురమాయింపుతోను, ఇతర కారణాల వల్ల పోలీసులు లాకప్పులో ఉన్నవాళ్లను కొడుతుంటారు. తీవ్రంగా కొట్టినప్పుడు వాళ్లు చచ్చిపోతారు.

ఇది విధి నిర్వహణ కాదు, నేరం అంటున్నాం. పోలీసులు ఎవరినయినా లాకప్పులో 24 గంటల కంటె ఎక్కువ ఉంచుకుంటే అది నేరం అంటున్నాం. లాకప్పులో హింసిస్తే నేరం అంటున్నాం. హింసించి చంపేసి ఏదో కథ అల్లి ప్రకటిస్తే అది హత్య అంటున్నాం. మేము అనడమేకాదు, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 20(3), 21, 22(1) ఈ మాటే అంటాయి. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని ఆర్టికల్ 3, ఐక్యరాజ్యసమితి పౌర రాజకీయ హక్కుల ఒడంబడికలోని ఆర్టికల్ 9, నిర్బంధితుల సంరక్షణ కోసం ఉద్దేశించిన మౌలిక సూత్రాలలోని 1, 2, 3, 21 సూత్రాలు ఈ మాటే అంటాయి.

వీటిని పోలీసులు చూసి ఎరుగరనుకున్నా వాళ్లు నిత్యం పఠించే నేరవిచారణ స్మృతి (సి ఆర్ పిసి), భారత శిక్షా స్మృతి (ఐ పి సి ) ఈ మాటే అంటాయి. అరెస్టు చేసిన వ్యక్తిని 24 గంటల కంటె ఎక్కువ సేపు పోలీసు కస్టడీలో ఉంచుకోరాదని సి ఆర్ పి సి సెక్షన్ 57 అంటుంది. సమాచారం రాబట్టడం కోసం 24 గంటల కంటే ఎక్కువ సేపు ఉంచుకుంటే అది నేరమనీ దీనికి 3 సంవత్సరాల జైలు శిక్ష అనీ భారత శిక్షాస్మృతి సెక్షన్ 348 అంటుంది. నేరం ఒప్పించడం కోసం, లేదా సమాచారం చెప్పించడం కోసం హింసిస్తే అది నేరమనీ దానికి 7 నుండి 10 సంవత్సరాల దాకా శిక్ష అనీ భారత శిక్షాస్మృతి సెక్షన్లు 330, 331 అంటాయి.

### 'నిజనిర్ధారణ కమిటీలు వేసి పోలీసులను ఖండించడం ఫ్యాషన్ అయిపోయింది'

**–డి జి పి ప్రభాకరరావు**

ఫ్యాషన్ అయితేనేం, అవసరమో కాదో చెప్పరాదూ? ఏ నేరం జరిగినా నిజనిర్ధారణ చేయడం మీ డ్యూటీ కదా, వేరే వాళ్లు ఆ పని చేసే అగత్యం ఎందుకు ఏర్పడింది? మీరు చేయరు, వేరేవాళ్లు చేయడం మీకు ఇష్టం లేదు. పోనీ ప్రభుత్వాన్ని అడిగి న్యాయవిచారణ జరిపించవచ్చును కదా? నిజనిర్ధారణ కమిటీలు వేసేవాళ్లు అదే అడుగుతున్నారు కదా? మీరు కూడ అడిగితే ప్రభుత్వం జరిపిస్తుంది కదా?
భయమా?

## ఎమర్జెన్సీ తరువాత రాష్ట్రంలో 'ఎన్‌కౌంటర్' చిట్టా

| సంవత్సరం | మృతుల సంఖ్య |
|---|---|
| 1980 | 7 |
| 1981 | 5 |
| 1982 | 4 |
| 1983 | 3 |
| 1984 | – |
| 1985 | 35 |
| 1986 | 20 |
| 1987 | 29 |
| 1988 | 61 |
| 1989 | 51 |
| 1990 | 20 |
| 1991 | 104 |
| 1992 (జనవరి నెల) | 27 |
| | 366 |

ఈ అధికార హత్యాకాండ మీద మేము సుప్రీంకోర్టులో *1981* లో వేసిన పిటిషన్ ఇప్పటికీ విచారణలో ఉంది. *1990*లో ప్రస్తుత డీ జి పి ప్రభాకరరావు దానికి సమాధానం ఇస్తూ, ఒక్కొక్క సంవత్సరం నక్సలైట్లు ఎన్ని హత్యలు చేసారో ఏకరువు పెట్టారు- అది మా ప్రశ్నకు సమాధానం ఎట్లా అవుతుందో మాకు అర్థం కాదు. వెయ్యి హత్యలు చేసినా వెయ్యి హత్య కేసులవుతాయి కానీ *366* 'ఎన్‌కౌంటర్'లు ఎట్లా అవుతాయి ?

## 'ఎన్‌కౌంటర్లన్నీ నిజమయినవే ఒక్కటి కూడ బూటకం కాదు'

**– డి జి పి ప్రభాకరరావు**

చాలా సంతోషం . ఆ విషయం న్యాయస్థానం ముందు రుజువు చేయవచ్చుకదా? చేసేస్తే ఇంక ఏ గొడవా ఉండదుకదా? దాని కెందుకు సిద్ధం కారు? అబద్ధమనా?

## 'ప్రభుత్వానికి కూడ తుపాకీ పట్టి నక్సలైట్లను అణచివేసే శక్తి ఉంది. అయితే ప్రభుత్వం చట్టానికి లోబడి పనిచేస్తూ ఉంది'

**– హోంమంత్రి మైసూరారెడ్డి**

ఇది నిజమయితే బాగుండును. కానీ ఇది పట్టి అబద్ధం. అబద్ధమని పూర్తి వివరాలతో మేము రుజువు చేయగలము. న్యాయవిచారణకు హోంమంత్రి సిద్ధమా?

## 'చట్టబద్ధంగా నక్సలైట్లను అణచడం సాధ్యం కాదు'

**– అనేక మంది పోలీస్ అధికార్లు**

అయితే రాజీనామా చేసి డ్రెస్ తీసేసి మీ స్వంత ముఠా పెట్టుకోండి. మీకు ఆ స్వేచ్ఛ ఉంది. డ్రెస్‌లో ఉండి ఆ మాట అనడానికి వీలులేదు.

## 'తుపాకి పట్టం, పట్టనివ్వం'

**– ముఖ్యమంత్రి జనార్దనరెడ్డి**

ఉన్న తుపాకులు చాలక బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌ను కూడ రప్పించుకొని ఈ మాటలనడం ఏం నిజం? అయినా తమరు ఎన్ని హత్యలు చేయించి ముఖ్యమంత్రి అయ్యారో ప్రజలు మరచిపోయారనుకుంటున్నారా జనార్దనా?

ఒక చర్యను నేరంగా చట్టం గుర్తించిన తరువాత, ఆ చర్యకు ఎవరయినా పాల్పడితే శిక్షించాలి కదా? ముందు కేసుపెట్టి విచారించాలి కదా? మరి ప్రతి రోజూ పోలీసులు జనాన్ని లాకప్పులలో అక్రమంగా నిర్బంధిస్తూనే ఉన్నారు. కొడుతూనే ఉన్నారు. ఆ పోలీసుల మీద కేసులెందుకు పెట్టడం లేదు? ఎందుకు విచారించడం లేదు? ప్రజలు నేరాలు చేస్తే నేరస్తులవుతున్నారు. పోలీసులు నేరాలు చేస్తే దానిని విధి నిర్వహణ అని ఎందుకు అంటున్నారు? ప్రజలు హత్య చేస్తే యావజ్జీవ ఖైదుకో ఉరికంబానికో పోతున్నారు. పోలీసులు హత్య చేస్తే రెండు వారాల సస్పెన్షన్‌తో ఎట్లా తప్పించుకోగలుగుతున్నారు? న్యాయవిచారణ నివేదికలు వాళ్లను స్పష్టంగా దోషులుగా గుర్తించినా వాళ్లను ఎందుకు శిక్షించడంలేదు? ఈ ప్రశ్నలు ఎవరో ఒకరు అడగనవసరం లేదా? మేము అడిగితే తప్పా?

మరి మా మీద ఈ దాడులెందుకు?

'ఎన్‌కౌంటర్ల' ప్రస్తావన ఇంకా ఎందుకు రాలేదా అని ఆశ్చర్యపోతున్నారా? పౌరహక్కుల సంఘమంటే 'ఎన్‌కౌంటర్ల'ను ఖండించే సంఘం అనే పేరు రావడానికి బాధ్యులం మేము కాదు. నిజానికి మేము చేసే పనిలో అది పావు వంతు కూడ కాదు. అయినా మాకు ఆ పేరు తగిలించడం మామీద దాడులు చేయడానికి పనికొస్తుంది కాబట్టి ఆ అభిప్రాయమే ఏలినవారు కలిగిస్తుంటారు.

'ఎన్‌కౌంటర్' పేరిట రాజకీయ కార్యకర్తలనూ, వాళ్లసానుభూతి పరులనూ కాల్చివేయడాన్ని మేము నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తాం. ఆత్మరక్షణ కోసం పోలీసులు నిజంగానే కాల్పులు జరపవలసి వస్తే అది వేరే విషయం. చట్టమే ఆ హక్కు ఇచ్చింది. పోలీసులకే కాదు, పౌరులందరికీ ఇచ్చింది. మీ మీద ఎవరయినా దాడి చేస్తుంటే ఆ దాడిని ఆపడానికి ఆ వ్యక్తి మీద మీరు ఎదురు దాడి చేయవచ్చును. అది మీ హక్కు. ఆ హక్కు మీకెంత ఉందో పోలీసులకు కూడ అంతే ఉంది. మీ కంటే పోలీసులకు వీసం కూడ ఎక్కువ లేదు.

మరి మీరే ఒక ఎల్లయ్యను ఎదురు కాల్పులలో కాల్చేసారను కోండి. పోలీస్ స్టేషన్‌కు పోయి ఆత్మరక్షణ కోసం ఎల్లయ్యను కాల్చేసానంటే భుజం తట్టి ఇంటికి పొమ్మంటారా? పొమ్మనరు. ముందు అరెస్టు చేసి హత్య కేసు పెడతారు. సెషన్స్ కోర్టు ముందు నిలబెడతారు. ఆ హత్య నిజంగా ఆత్మరక్షణ కోసం జరిగిందని మిమ్మల్నే రుజువు చేసుకొమ్మంటారు. రుజువు చేసుకోలేకపోతే జైలుకో, ఉరికంబానికో పంపుతారు. చట్టం ఈ విషయాన్ని సుస్పష్టం చేసింది.

పోలీసులకూ ఇదే వర్తిస్తుందనీ, 'ఎన్‌కౌంటర్లు' చేసిన పోలీసు అధికార్లను కోర్టులో నిలబెట్టి హత్యానేరానికి విచారించాలనీ మేము అంటున్నాం. అందుకు భిన్నంగా వాళ్ళను హీరోలుగా చిత్రించి పారితోషికాలూ, ప్రమోషన్లూ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నాం. 'ఎన్‌కౌంటర్' జరిగినప్పుడల్లా నిజనిర్ధారణ కమిటీలు వేసి నిజంగా ఆత్మరక్షణార్థం కాల్పులు జరిగాయా లేక పోలీసులే హత్య చేసారా అని కనుక్కుంటున్నాం. అది తప్పా?

అసలు 'ఎన్‌కౌంటర్లు' పోలీసులు తమ స్వంత దుర్బుద్ధితో చేస్తున్నవి కావంటున్నాము. 'నక్సలిజం' అనే రాజకీయ పోరాటాన్ని రాజకీయంగా ఎదుర్కోవడం చేతకాని ప్రభుత్వం వాళ్లను అణచివేసే కర్తవ్యం పోలీసులకు అప్పజెప్పింది. 'నిర్దాక్షిణ్యంగా', 'కఠినంగా' వ్యవహరించమని పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్టు మంత్రి వర్యులు తరచు ప్రకటిస్తుంటారు. ఈ రకమయిన ఆదేశాలు ఏ చట్టం క్రింద ఇస్తున్నారని మేము అడుగుతున్నాం. నేరం ఎవరు చేసినా ఒకే రకంగా వ్యవహరించాలి. చట్టాన్ని పౌరులందరికీ ఒకే రకంగా వర్తింపజేయాలి. పోలీసులు ఒకరి పట్ల కఠినంగా ఒకరి పట్ల సరళంగా, ఒకప్పుడు నిర్దాక్షిణ్యంగా ఒకప్పుడు దాక్షిణ్యంగా వ్యవహరించడం ఏ ప్రజాస్వామ్య నియమం అని మేము అడుగుతున్నాం. కొంత మందిని వేలు పెట్టి చూపి వీళ్ళను కాల్చిపారేయమని ఆదేశం ఇచ్చే అధికారం రాజ్యాంగం ఈ ప్రభుత్వానికి ఎక్కడ ఇచ్చిందని అడుగుతున్నాం.

ఆయుధాలు పట్టుకున్న నక్సలైట్లనయినా పోలీసులు అరెస్టు చేయవలసిందేగానీ కాల్చి పారేయడానికి వీలు లేదు. అరెస్టును ప్రతిఘటిస్తే మట్టుకు బలప్రయోగం చేయవచ్చును. చట్టంలో పోలీసులకు ఆ అధికారం ఉంది. కానీ పోలీసులు కాల్చేస్తున్నది నూటికి 95 శాతం సాయుధులను కాదు, నిరాయుధులను. నక్సలైట్ పార్టీల లీగల్ కార్యకర్తలను, గ్రామీణ మిలిటెంట్లను, వాళ్ళకు అన్నంపెట్టిన వాళ్లను, ఆశ్రయం ఇచ్చిన వాళ్లను, వాళ్ల కరపత్రాలు పంచిన వాళ్లను, కార్యక్రమాలలో పాల్గొన్నవాళ్లను పట్టుకొని కాల్చేస్తున్నారు. లేదా ప్రజలను భయభ్రాంతులు చేయడం కోసం ఎవరినో ఒకరిని పట్టుకొని కాల్చేస్తున్నారు. గ్రామాలలో పెత్తందార్లను ప్రశ్నించిన వాళ్లకు 'నక్సలైట్' అనే పేరు పెట్టి కాల్చేస్తున్నారు. ఇది అన్యాయం అంటున్నాం. భారత రాజ్యాంగం ఆర్టికల్ 21లో హామీయిచ్చిన చట్టపరమయిన జీవించే హక్కుకు విరుద్ధం అంటున్నాం. ఇది తప్పా?

మరి మా మీద ఈ దాడులెందుకు?

సామాజిక న్యాయం: సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం మన రాజ్యాంగం ప్రకటించుకున్న లక్ష్యం. రాజ్యాంగం ప్రకటించినా లేకున్నా అది నాగరిక సమాజ లక్ష్యం. దానికి అడ్డం వచ్చే అన్ని శక్తులనూ మేము వ్యతిరేకిస్తున్నాం. కూలివాళ్లపైన భూస్వాముల,

## రాష్ట్రంలో దళితులపైన దాడులు: ఆరేళ్ల రికార్డు

(ప్రధాన సంఘటనలు మాత్రమే)

| | | |
|---|---|---|
| ప్రకాశం జిల్లా | - | కారంచేడు, టంగుటూరు, తిమ్మసముద్రం పోలెపల్లి |
| గుంటూరు జిల్లా | - | నీరుకొండ, మందడం, కొల్లిపర, చుండూరు |
| కృష్ణా జిల్లా | - | కొడవటికల్లు, నక్కలంపేట, చిల్లకల్లు, గోకరాజుపల్లి |
| విజయనగరం జిల్లా | - | గుడియాడ, చినకాద, కస్పాగదబవలస |
| నెల్లూరు జిల్లా | - | దొంతాలి, బీర్నకల్లు |
| పశ్చిమ గోదావరి జిల్లా | - | పిప్పర, గూట్లపాడు |
| ఆదిలాబాద్ జిల్లా | - | హస్నాపూర్, అంబారీపేట |
| రంగారెడ్డి జిల్లా | - | జబ్బార్‌గూడెం, రెడ్డిపల్లి |
| చిత్తూరు జిల్లా | - | బండ్లపల్లి |
| కడప జిల్లా | - | పులివెందుల |
| శ్రీకాకుళం జిల్లా | - | జీరుపాలెం |
| తూర్పు గోదావరి జిల్లా | - | వేట్లపాలెం |
| అనంతపురం జిల్లా | - | కొత్తపూలవాండ్లపల్లి |
| కర్నూలు జిల్లా | - | మూడురాళ్ళపల్లి |

## 'దళితులను అగ్రకులాల వారు చంపినా తప్పే, అగ్ర కులాల స్త్రీలను దళితులు వేధించినా తప్పే'

**– కొన్ని తెలుగు దిన పత్రికల సంపాదకులు**

స్త్రీలను ఎవరు వేధించినా తప్పే. దానికి కులంతో ప్రమేయం లేదు. అయితే నిత్యం అన్ని కులాలలో జరిగే ఈ వేధింపునూ చుండూరు వంటి సామూహిక హత్యా కాండనూ ఎంత చాకచక్యంగా ఒకటి చేసి చూపించారో గమనించండి.

## స్త్రీల అసహజ మరణాలు

కృష్ణా జిల్లాలో ఆరు నెలల కాలంలో అసహజమరణాల పాలైన స్త్రీలు (1991 మే - అక్టోబర్)

| మరణించిన పద్ధతి | సంఖ్య |
|---|---|
| ఒళ్లుకాలి | 26 |
| ఉరి | 12 |
| విషం | 4 |
| బావిలోపడి | 3 |
| కత్తిపోటు | 2 |
| మొత్తం | 47 |

ఒక్క జిల్లాలో 6 నెలల కాలంలో 47 అసహజ మరణాలంటే రాష్ట్రంలో 1 సంవత్సరానికి సగటున 2162 అసహజ మరణాలని అర్థం. ఇందులో కొన్ని నిజంగా ప్రమాదవశాత్తు జరిగినవి ఉండవచ్చు. అయినప్పటికీ బలవన్మరణాల సంఖ్య చాలా ఉందనేది స్పష్టం. స్త్రీల జీవించే హక్కు మీద దాడి రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున జరుగుతూ ఉంది.

పెట్టుబడిదార్ల పెత్తనాన్ని వ్యతిరేకిస్తున్నాం. దళితులపైన అగ్రకులాల పెత్తనాన్ని వ్యతిరేకిస్తున్నాం. స్త్రీలపైన మగవాళ్ల పెత్తనాన్ని వ్యతిరేకిస్తున్నాం. గిరిజనులపైన గిరిజనేతరుల పెత్తనాన్ని వ్యతిరేకిస్తున్నాం.

అంటరానితనాన్ని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 నిషేధించింది. అయినా అన్ని ప్రాంతాలలోనూ ఏదో ఒక మేరకు అంటరానితనం అమలవుతూనే ఉంది. దీనిని వ్యతిరేకించే ఉద్యమాలలో పాల్గొంటున్నాం. దళిత ఉద్యమాలకు మద్దతు ఇస్తున్నాం.

కుల వివక్షను ఆర్టికల్ 15 నిషేధించింది. అంతేకాదు, కులం రీత్యా వివక్షకు గురయిన వాళ్లు ఆ వివక్షను అధిగమించి సమానత్వాన్ని సాధించడానికి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఆర్టికల్ 15(4) నిర్దేశించింది. ఆ ప్రత్యేక సదుపాయాలలో ఒకటయిన రిజర్వేషన్లను సమర్ధిస్తున్నాం. రిజర్వేషన్లకు మద్దతుగా ఉద్యమించాం.

దళిత కులాలకు చెందిన వాళ్లు తమ వెనుకబాటుతనాన్ని అధిగమించి స్వాతంత్ర్యాన్నీ, స్వేచ్ఛనూ ప్రకటించుకుంటే అగ్రకులాల వారు సహించలేకుండ ఉన్నారు. దాడులు చేస్తున్నారు. చంపుతున్నారు. ఇళ్లు తగలబెడుతున్నారు. ఈ అత్యాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేపట్టాం. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల (అత్యాచారాల నిరోధక) చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆందోళన చేసాం.

స్త్రీలయినా, పురుషులయినా పౌరులందరికీ తగినంత జీవనాధారం ఉండేలాగ చూడాలని రాజ్యంగంలోని ఆదేశిక సూత్రమయిన ఆర్టికల్ 39 అంటుంది. పురుషులలో నిరుద్యోగులూ, జీవనాధారం లేనివాళ్లూ చాలామంది ఉండగా స్త్రీలలో అతికొద్దిమందికి మట్టుకే స్వతంత్రమయిన జీవనాధారం ఉంది. స్త్రీ పురుష వివక్ష పాటించరాదని ఆర్టికల్ 15 అంటుంది. కానీ ప్రతీ కుటుంబంలోనూ స్త్రీ పురుష వివక్ష అన్ని విషయాల లోనూ పాటిస్తూనే ఉన్నారు. స్వేచ్ఛా సమానత్వాలు రాజ్యాంగ ఆదర్శాలు. కానీ స్త్రీలకు స్వేచ్ఛ లేదు, సమానత్వం లేదు.

ఈ పరిస్థితిని ప్రతిఘటించిన స్త్రీలందరూ హింసకు గురి అవుతూనే ఉన్నారు. వరకట్నం పేరుమీదనో, వేరే పేరు మీదనో హత్యకు గురి అవుతున్నారు. రాక్షసత్వానికి మారుపేరయిన పోలీసులు ఒక్క సంవత్సరంలో రాష్ట్రమంతటా ఎంతమందిని చంపుతారో, అంతమంది స్త్రీలను ఒక్కొక్క జిల్లాలో భర్తలు చంపుతున్నారు. మన సమాజంలో ప్రతి మగవాడూ ఒక పరమ పోలీసు.

ఈ హత్యాకాండకు వ్యతిరేకంగా రావలసిన నిరసనలో శతాంశం కూడ రావడం లేదు. ఆ శతాంశంలో మా వంతుగా మేము గొంతు కలుపుతున్నాము. వరకట్నం మరణాల కోసం ఉద్దేశించబడిన ఐ పి సి సెక్షన్ 304-బి ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. లైంగిక అత్యాచారాలను పోలీసులు సీరియస్‌గా ఇన్వెస్టిగేట్ చేయడం లేదని విమర్శిస్తున్నాం. పోలీసు అధికారులూ, న్యాయవాదులూ ,న్యాయమూర్తులూ ఈ కేసుల పట్ల మగవాళ్లగా స్పందిస్తున్నారు తప్ప తమ విధి నిర్వహణకు ఉద్దేశించిన ప్రమాణాలకు తగ్గట్టు వ్యవహరించడం లేదని విమర్శిస్తున్నాం.

ఇదంతా తప్పని ఎవ్వరూ అనరు. అయితే మామీద ఈ దాడులెందుకు?

**ఉద్యమించే హక్కు:** రాజ్యాంగంలో ఎన్ని హక్కులు రాసుకున్నా, ఎన్ని ఆదర్శాలు ప్రకటించుకున్నా ధనవంతులు, బలవంతులు ఏలే ఈ సమాజంలో అవి సాధ్యం కావాలంటే వాటికోసం ప్రజలు ఉద్యమించాలి. ఉద్యమించనిదే ఏ హక్కూ దక్కదు. అందుకని మేము ఉద్యమించే హక్కును, పోరాడే హక్కును ఒక ముఖ్యమైన హక్కుగా భావిస్తున్నాం.

అందుకే మా మీద యింత కోపమా? రాజ్యాంగంలో ఇది వుంది, అది వుంది అంటున్నంత కాలం ఎవరికీ అభ్యంతరం వుండదు. అంతర్జాతీయ ప్రకటనలలో ఏవేవి రాసుకున్నారో ఏకరువు పెడుతూ కూర్చుంటే కూడా అభ్యంతరం వుండదు. వాటికోసం ఉద్యమించే హక్కు ప్రజలకు ఉందంటే మాత్రం సహించలేరు.

పౌరహక్కుల సంస్థలు మాత్రం ఉద్యమించే హక్కును ఎట్టి పరిస్థితుల్లోనయినా సమర్థిస్తాయి. ఉద్యమాలను ప్రభుత్వం అణచివేయజూస్తే మేము వ్యతిరేకిస్తాం. ఉద్యమకారులకు వాక్ సభా స్వాతంత్ర్యాలు, చట్టపరమైన జీవించే హక్కు, కోర్టులో నిష్పాక్షికమైన విచారణ ఇవేవీ ఉండవంటే వ్యతిరేకిస్తాం. ఏ ఉద్యమమైనా కొన్ని సామాజిక ఆర్థిక పరిస్థితుల్లో పుడుతుంది. కొన్ని సమస్యల్ని వేలెత్తి చూపుతుంది. వాటి పరిష్కారాన్ని ప్రభుత్వం చేపట్టాలి. ప్రభుత్వం వుండేదే అందుకు. (ఎమ్మెల్యేలూ మంత్రులూ ఆస్తులు సంపాదించుకోవడానికి కాదు.) అంతే తప్ప ఉద్యమాలను అప్రజాస్వామికంగా అణచివేయడం కోసం కాదు.

మరి ఉద్యమకారులు నేరాలు చేస్తుంటే చూస్తూ వూరుకోవాలా అని మమ్మల్ని ఆవేశంగా అడుగుతారు. హత్యలు చేస్తుంటే బస్సులు తగలబెడుతుంటే, కిడ్నాపులు చేస్తుంటే ప్రభుత్వ చేతులు ముడుచుకుని కూర్చోవాలా అని అడుగుతారు. మామీ దాడి చేసేవాళ్లంతా మమ్మల్ని ఈ ప్రశ్నే అడుగుతారు.

చూస్తూ వూరుకోమని మేము అనడంలేదు. చట్టం ప్రకార వీటిని అరికట్టే చర్యలు తీసుకోమనే అంటున్నాం. కేసులు పెట్టి అరెస్టులు చేసి న్యాయసమ్మతంగా విచారించి శిక్షించమనే

## ‘తీవ్రవాద సమస్యను శాంతి భద్రతల సమస్యగానే పరిగణించి అణచివేయాలి’

**– బి జె పి నాయకుడు విద్యాసాగరరావు**

*ఆంధ్ర ప్రదేశ్‌లో అణచివేయాలి. పంజాబులో అణచివేయాలి. కాశ్మీర్‌లో అణచివేయాలి. అస్సాంలో అణచివేయాలి. బీహార్‌లో తమిళనాడులో, త్రిపురలో, మణిపూర్‌లో, నాగాలాండ్‌లో, మిజోరంలో అణచివేయాలి. భారత భూభాగంలో అణచివేత అక్కరలేని చోటు ఎక్కడ ఉందో భారతీయ జనతా పార్టీ నాయకులు చెప్తారా? ‘సుజలాం సుఫలాం’ అని తాము గర్వంగా చెప్పుకునేది వట్టి భూభాగమేనా? మనుషులు కారా?*

## ‘మేము నిర్ణయించిన గడువులోగా జిల్లాలోని తీవ్రవాదులంతా లొంగిపోవాలి. లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయి’

**– వరంగల్, గుంటూరు జిల్లాల పోలీస్ సూపరింటెండెంట్లు**

*ఒక రాజకీయ ఉద్యమ కార్యకర్తలను లొంగిపొమ్మని గడువులు ప్రకటించే అధికారం ఏ చట్టం పోలీసులకు ఇచ్చింది?*
*చట్టం అవసరం లేకుండ అధికారాలు చలాయించేటట్టయితే మీరు పోలీస్ అధికారులు కారు, మాఫియా లీడర్లని మేము అంటున్నాం. అది తప్పని ఏ రాజ్యాంగ నిపుణుడయినా అంటాడా?*

## ‘నక్సలైట్ ఉద్యమం వెనుక భూమి సమస్య ఉందనడం వట్టి అబద్ధం’

**– డి జి పి ప్రభాకరరావు**

**– ముఖ్యమంత్రి జనార్దనరెడ్డి**

*రాష్ట్ర గ్రామీణ ప్రాంతాలలో 1981 జనాభా లెక్కల ప్రకారం 83 లక్షల మంది భూమిలేని వ్యవసాయ కూలీలున్నారు. 45 లక్షల మంది 2 1/2 ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులున్నారు.*
*మరొక వైపు 25 ఎకరాల కంటె ఎక్కువ భూమి ఉన్నవాళ్లు దాదాపు 1 1/2 లక్షల మంది ఉన్నారు.*
*భూ సంస్కరణ చట్టాల కింద ప్రభుత్వం పేదలకు పంచి ఇచ్చిన భూమి రాష్ట్రంలోని సేద్యయోగ్యమయిన భూమిలో నూటికి 2 ఎకరాలు కూడ లేదు.*
*ఈ వైఫల్యాన్ని కప్పిపెట్టుకోవడానికి కాకపోతే భూమి సమస్య లేదనడం ఎందుకు?*

## ‘విలేఖరులలో తీవ్రవాద సానుభూతిపరులు ఉన్నారు’

**– బి జె పి నాయకుడు వేణుగోపాల రెడ్డి**

*మీ సానుభూతిపరులు మాత్రమే ఉండాలా?*
*విలేఖరులు తప్పుడు వార్తలు రాస్తే అది తప్పవుతుందికానీ వాళ్లకు ఒక రాజకీయ అభిప్రాయం ఉండడం తప్పెట్లా అవుతుంది?*

## ‘నక్సలైట్లు మాత్రమే పౌరులా?’

**– పోలీస్ అధికార్లు, పత్రికా సంపాదకులు, రాజకీయ నాయకులు (ముక్త కంఠంతో)**

*ఎంత మాత్రం కాదు. అందరూ పౌరులే. నక్సలైట్లు కూడ పౌరులేనంటున్నాం. వాళ్లకు కూడ అందరిలాగ హక్కులున్నాయంటున్నాం. వాళ్లకు కూడ వాక్ సభా స్వాతంత్ర్యాలు, చట్టపరమయిన జీవించే హక్కు ఉన్నాయంటున్నాం. అందరికీ చట్టాన్ని వర్తింపజేసి, వాళ్లను మట్టుకు కాల్చిపారేస్తామంటే కుదరదంటున్నాం. అందరినీ మీటింగ్‌లు పెట్టుకోనిచ్చి వాళ్లను మట్టుకు పెట్టుకోనీయక పోవడం అన్యాయమంటున్నాం. అందరినీ ఎన్నికలలో పాల్గొననిచ్చి వాళ్లను మట్టుకు పాల్గొననీయకపోవడం తప్పంటున్నాం.*

అంటున్నాం. అయితే ఉద్యమకారులు హింసామార్గాన్ని ఎంచుకున్నంతమాత్రాన ఉద్యమాలను కేవలం నేరాలుగా చూడవద్దంటున్నాం. ఎన్ని వందలమందిని చంపేసినా ఎక్కడా ఏ ఉద్యమాన్నీ ఎందుకు అణచలేకపోతున్నారో ఆలోచించమంటున్నాం. అందుకు కారణమైన భౌతిక పరిస్థితులను సంస్కరించమంటున్నాం.

ఇది తప్పా?

ప్రభుత్వం యిందుకు పూర్తిగా భిన్నంగా నడుచుకుంటూ వుంది. భూమి సమస్య నుండి, గ్రామీణ పేదరికం, అణచివేతల నుండి పుట్టిన నక్సలైటు ఉద్యమాన్ని వట్టి దుండగుల చర్యగా భావిస్తానంటూ వుంది. సుదీర్ఘమైన రాజకీయ నేపథ్యం ఉన్న కాశ్మీర్, పంజాబ్, ఈశాన్య భారత ఉద్యమాలను వట్టి దుండగుల చర్యగా భావిస్తానంటూ వుంది. తీవ్రవాదం, ఉగ్రవాదం, వేర్పాటువాదం అని నామకరణం చేసి అణచివేస్తానంటూ వుంది. ప్రభుత్వం ఒక్కటే కాదు, మేధావులు, పత్రికలు, ప్రతిపక్షాలు చాలావరకు ఇదే వైఖరిని అవలంబిస్తున్నారు.

ఈ అణచివేతను వ్యతిరేకించడమే కాక మేము ఒక్కొక్క అణచివేత రూపాన్ని నిశితంగా విమర్శిస్తున్నాము. ఎందుకంటే ఈ అణచివేతకు బలవుతున్నది కేవలం కొన్ని ఉద్యమాలు కావు; కొందరు ఉద్యమకారులు, వారి సానుభూతిపరులు మాత్రమే కాదు (వాళ్లంటే మీకు ఇష్టం లేకపోతే పోనీలే అనుకోవచ్చు); ఈ అణచివేతకు గురవుతున్నది మనందరి హక్కులు. ఎన్‌కౌంటర్ లో పోయేది నక్సలైటు ప్రాణం మటుకే కాదు. చట్టపరమైన జీవించే హక్కు పోతోంది. అది మనందరిది.

అణచివేతలో చట్టబద్ధపాలన(Rule of Law) అనే మౌలిక ప్రజాస్వామ్య సూత్రం బలవుతోంది. అది ఒకరి విషయంలో తప్పు కాదనుకుంటె యింకొకరి విషయంలో తప్పు అనే నైతిక అర్హత మనకు వుండదు. చట్టం తక్కిన వాళ్లందరికీ వర్తిస్తుంది కాని 'తీవ్రవాదులకు' మటుకు వర్తించదని, భావప్రకటనా స్వేచ్ఛ అందరికీ వుంటుంది కాని 'తీవ్రవాదులకు' మటుకు వుండదని బాధ్యతగల వ్యక్తులు ప్రకటించడం, మనమంతా అనాలోచితంగా ఆమోదించడం పరిపాటి అయిపోయింది. ఇది కేవలం ఆ 'తీవ్రవాదులకు' కాదు, భారత ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమైన పరిణామం అంటున్నాం. "తీవ్రవాదుల హక్కుల గురించే ఎందుకు మాట్లాడతారు?'' అని మమ్మల్ని అడుగుతుంటారు. మేము ఒకరి హక్కుల గురించి మాట్లాడడం లేదు,అందరి హక్కుల గురించి మాట్లాడుతున్నాం. ఎవరికి ఎక్కువగా హక్కులు నిరాకరిస్తారో వారి హక్కుల గురించి ఎక్కువగా మాట్లాడడం సహజం. వాళ్లు మాత్రమే పౌరులనడం లేదు. వారు కూడా పౌరులే అంటున్నాం. ఇవ్వాళ నక్సలైట్లు కావొచ్చు, కాశ్మీర్, అస్సాం, నాగాలాండ్ ఉద్యమకారులు కావొచ్చు, రేపు మీరే కావొచ్చు.

'తీవ్రవాదం' మీద నెపంపెట్టి మన రాజకీయ స్వేచ్ఛను పాలకులు పోలీసుల చేతిలో పెట్టారు. చట్టబద్ధపాలన స్థానంలో పోలీసుపాలన నెలకొనింది. పోలీసులు అన్ని రంగాలలో మన జీవితాన్ని శాసించడం ప్రారంభించారు. ఎవరు సభలు జరుపుకోవచ్చునో, ఎవరు జరుపుకోకూడదో పోలీసులు నిర్ణయిస్తున్నారు. ఒక రాజకీయ పార్టీ బంద్ కు పిలుపిస్తే ప్రజలు పాల్గొనవచ్చునో లేదో నిర్ణయిస్తున్నారు. విలేఖరులు ఏ వార్తలు రాయవచ్చునో, ఏవి రాయకూడదో నిర్ణయిస్తున్నారు. విద్యార్థులు ఏ పుస్తకాలు చదవవచ్చునో, ఏవి చదవకూడదో నిర్ణయిస్తున్నారు. (కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు శ్రీ శ్రీ రచనలను పోలీసుస్టేషన్ లో అప్పజెప్పి పరీక్షలు వచ్చినపుడు తీసుకోవాలని వరంగల్ ఎ.ఎస్.పి. ఈ మధ్యనే శాసించింది!). హైదరాబాద్ లో 'ఉదయం' విలేఖరి గులాం రసూల్‌ను హత్య చేసినందుకు పోలీసులు కనీసం సిగ్గుపడకపోగా, తాము అనుసరిస్తున్న చట్ట వ్యతిరేక అణచివేత విధానాలకు పత్రికలు సహకరించాలనీ, తమకు ఇబ్బంది కలిగించే వార్తలు రాయకూడదనీ బహిరంగంగానే మాట్లాడడం ప్రారంభించారు. పోలీసులే కాదు, హోంమంత్రి ముఖ్యమంత్రి కూడ పత్రికలు బూటకపు ఎన్‌కౌంటర్ల గురించి రాయడం వల్ల పోలీసులకు ఇబ్బంది అవుతోందని మాట్లాడుతున్నారు. ఈ లజ్జారహితమయిన పరిణామాలవల్ల నక్సలైట్లకు మాత్రమే నష్టం లెమ్మనుకోవడం కంటే మూర్ఖత్వం వేరే ఏమయినా ఉంటుందా అని ఆలోచించమంటున్నాం. గులాం రసూల్‌ను హత్య చేసి వచ్చి అబద్ధపు కథ అల్లిన సరూర్‌నగర్ డి ఎస్ పి ని కనీసం సస్పెండ్ కూడ చేయకపోగా, 'విలేఖర్లలో ఇంకా తీవ్రవాద సానుభూతిపరులు ఉన్నారు' అని ముఖ్యమంత్రి ప్రకటిస్తాడు. ఆయన ప్రకటనకు భారతీయ జనతాపార్టీ నాయకులు వంత పాడతారు. తీవ్రవాద సానుభూతి పరులయితే కాల్చిపారేయొచ్చా అని ఎవరూ అడగరు. ఈ మౌనాన్ని ఆసరా చేసుకొని పోలీసులు విలేఖరుల ఇళ్లసోదాలు, వేధింపులు కొనసాగిస్తారు. కరీంనగర్ లో ఒక స్థానిక దినపత్రిక కార్యాలయానికి పోలీసులు ఫోన్ చేసి ఏడుగురు విలేఖర్ల పేర్లు చెప్పి, నక్సలైట్లు ఈ జిల్లాలో ఏమయినా చేస్తే వీళ్లను చంపుతాం అని బెదిరిస్తారు. పత్రికాస్వేచ్ఛ మీద ఇంత నగ్నమయిన దాడి ఈ మధ్యకాలంలో దేశంలో ఎక్కడా జరిగి ఉండదు. 'తీవ్రవాదం' అన్న బూచిని చూపించినంత మాత్రాన అందరూ దీనిని మౌనంగా ఆమోదిస్తే చివరికి నష్టపోయేది ఎవరో ఆలోచించమని మేము అంటున్నాం. అది తప్పా?

## 'తుపాకులు పట్టుకొని తిరుగుతున్న వాళ్లమీద టాడా పెడితే తప్పేముంది?'

**– డి జి పి ప్రభాకరరావు**

తుపాకులు పట్టుకొని తిరిగినా, బాంబులు మోసుకొని తిరిగినా అప్రజాస్వామికమయిన 'టాడా' పెట్టడం తప్పే. నేరం చేసారని పోలీసులు ప్రకటిస్తే సరిపోదు. నేరం చేసినట్టు నిష్పాక్షికంగా రుజువు కావాలి. దాని కోసం నేర విచారణ న్యాయంగా జరగాలి. 'టాడా' కింద అది జరగదు.

అయినా, ఈ ప్రశ్నే అబద్ధపు ప్రశ్న.

'టాడా' కేసులు పెడుతున్నది (నూటికి తొంభై శాతం) తుపాకులు పట్టుకొని తిరుగుతున్నవాళ్లమీద కాదు. భూస్వాముల భూములు దున్నుకున్నవాళ్ల మీద, విప్లవ పార్టీల లీగల్ కార్యకర్తల మీద, గ్రామీణ మిలిటెంట్లమీద, సానుభూతిపరులమీద, వాళ్లకు ఆశ్రయం ఇచ్చినవాళ్ల మీద.

ఒక్కొక్క కేసు బయటికి తీసి ఎవరిమీద పెడుతున్నారు బహిరంగంగా విచారించడానికి డి.జి.పి సిద్ధమేనా?

## 'టాడా' చట్టం

- భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 19(1), 20(3), 21లకు విరుద్ధమయినది
- అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటనలోని ఆర్టికల్స్ 2, 7, 10, 11(1), 19లకు విరుద్ధమయినది.
- ఐక్యరాజ్యసమితి పౌర రాజకీయహక్కుల ఒడంబడికలోని ఆర్టికల్స్ 9(3), 14(1)(2)(3), 19(1)(2), 26లకు విరుద్ధమయినది.
- నిర్బంధితుల సంరక్షణ కోసం ఉద్దేశించిన మౌలిక సూత్రాలలోని ప్రిన్సిపుల్స్ 21(1)(2), 36(1)(2)లకు విరుద్ధమయినది.

## వరంగల్ జిల్లాలో 'టాడా' ప్రయోగం

| సంవత్సరం | కేసుల సంఖ్య | ముద్దాయిల సంఖ్య |
|---|---|---|
| 1985 | 1 | 19 |
| 1986 | 1 | 1 |
| 1987 | 23 | 96 |
| 1988 | 85 | 311 |
| 1989 | 43 | 157 |
| 1990 | 56 | 833 |
| 1991(ఆగస్ట్ నెల దాకా) | 15 | 125 |
| | 224 | 1524 |

ఇది ఒక్క వరంగల్ జిల్లా రికార్డు

## 'కాశ్మీర్‌లో స్త్రీలనూ పసిపిల్లలనూ ఊచకోత కోస్తుంటే పౌరహక్కుల సంఘాలకు పట్టదా?'

**– మురళీమనోహర్ జోషి**

అది కాశ్మీర్‌లో నిజంగా జరిగి ఉంటే ఖండిస్తాం. కానీ ఎక్కడ జరిగింది? ఎప్పుడు జరిగింది? జరిగిందని బి జె పి నాయకులు రుజువు చేస్తారా? రుజువు చేయలేకపోతే, తాము దేశ వ్యాప్తంగా చేసిన ఈ దుష్ప్రచారానికి క్షమాపణ చెప్పుకుంటారా?

అణచివేతలో 'ఎన్‌కౌంటర్లు', చిత్రహింసలు, అక్రమ నిర్బంధాలు, గ్రామాలపైన దాడులు ఒక అంశమయితే, కోర్టులో ముద్దాయికి ఉండే కనీసహక్కులను తీసివేసే 'నల్ల చట్టాలు' మరొక అంశం.

నిర్దిష్టమయిన నేరారోపణ చేయకుండ, 'నువ్వు స్వేచ్ఛగా ఉంటే శాంతి భద్రతలకు ప్రమాదం కాబట్టి జైల్లో పెడుతున్నాం' అని నిర్బంధించే జాతీయ భద్రతా చట్టం (నాసా) వీటిలో ఒకటి. కార్మికులు సమ్మెకు పూనుకుంటే దానికి కారణమేమిటో విచారించకుండ, సమ్మె జరిగితే సమాజానికి నష్టమని చెప్పి సమ్మెను నిషేధించి కార్మిక నాయకులను అరెస్టుచేసే అత్యవసర సర్వీసులనిర్వహణ చట్టం (ఎస్మా) ఇంకొకటి. టెర్రరిస్టు విచ్ఛిన్నకర కార్యకలాపాల నిరోధక చట్టం (టాడా) మరొకటి. దీనికింద మన రాష్ట్రంలో 10 వేలమందికి పైగా ముద్దాయిలు ఉన్నారు కాబట్టి దీని గురించి ఎక్కువగా ఆందోళన చెందడం అవసరం. ఈ చట్టం ముద్దాయికి కోర్టులో ఉండే అన్ని హక్కులనూ తీసివేస్తుంది. టాడా కింద

- లాకప్పులో కొట్టి ఒప్పించిన విషయం కోర్టులో సాక్ష్యంగా చెల్లుబాటవుతుంది.
- నేరారోపణ పోలీసులు చేయగా నిర్దోషిత్వం ముద్దాయి రుజువు చేసుకోవాలి.
- ముద్దాయికి నేరారోపణ పూర్తి వివరాలు తెలపకుండ విచారణ జరుపుతారు.
- విచారణ రహస్య స్థలంలో జరుపుతారు.
- ముద్దాయి నిర్దోషి అని కోర్టునమ్మితే తప్ప బెయిలు దొరకదు.
- ఒక్క సంవత్సరం దాకా చార్జిషీటు పెట్టకుండ జైలులో ఉంచవచ్చు.
- దేశంలోని ఏదయినా ఒకప్రాంతానికి విడిపోయే హక్కు ఉందని అభిప్రాయం వెలిబుచ్చినందుకు యావజ్జీవ కారాగార శిక్ష వేస్తారు.
- 'టెర్రరిస్టులు' అని పోలీసులు గుర్తించిన వ్యక్తులతోనూ, వారికి సహకరించేవారితోనూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినా లేక ఏ రకమయిన సంబంధం కలిగి ఉన్నా అదీ నేరమే.

ఇదొక నాగరిక దేశంలో ఉండవలసిన చట్టమా? దీనిని రద్దు చేయాలని మేము అనడం నేరమా?

మరి మాపైన ఈ దాడులెందుకు?

**వాళ్లహింసను ఎందుకు ఖండించరు?** అంతా బాగానే వుంది కాని నక్సలైట్లు చేసే హింసను ఎందుకు ఖండించరు అని మమ్మల్ని అడుగుతారు. దళితులను అగ్రకులాలవారు చంపితే ఖండిస్తారు కాని దళితుల దుష్ప్రవర్తనను ఎందుకు ఖండించరు అని అడుగుతారు. చివరికి ఒక దొంగను పోలీసులు కొట్టిచంపినా ఖండిస్తారు కాని దొంగతనాలను మీరెప్పుడూ ఖండించగా చూడలేదే అంటారు.

మేము ఖండించకపోతే వాళ్లమీద కేసులు పెట్టరా? కోర్టులు, జైళ్లు మా ఖండన కోసం కాచుకుని వుంటాయా? ఎవరూ నేరాలు చేయకుండా చూసే సంఘం కాదు మాది. అది పోలీసుల డ్యూటీ, మా డ్యూటీ కాదు. హింసకు, అలజడికి - చివరికి దొంగతనాలకు కూడ - సామాజిక కారణాలు వుంటాయి. ఆ కారణాల గురించి ఆలోచించే సంఘం మాది. ఆ కారణాలను తొలగించవలసిన బాధ్యత ప్రభుత్వం మీద వుంది. రాజ్యాంగ ఆదేశిక సూత్రాల సారాంశం అదే. ఆ బాధ్యత గురించి, ప్రభుత్వం బాధ్యతా రాహిత్యం గురించి ఆలోచించే సంఘం మాది. నేరాలను నివారించడానికి, న్యాయసమ్మతంగా విచారించడానికి కొన్ని ప్రమాణాలున్నాయి. కొన్ని చట్టాలున్నాయి. వాటి అమలు గురించి ఆందోళన చెందే సంఘం మాది.

ఎవ్వరూ హింస చేయకుండా వుంటేనే బాగుంటుంది. ఎవ్వరూ నేరాలకు పాల్పడకుండా వుంటేనే బాగుంటుంది. అయితే మనసమాజం యివ్వాళ అట్లా లేదు. లేకపోవడాన్ని ఖండిస్తే సరిపోదు. దాని గురించి ఆలోచించాలి. సమాజంలో అందరూ అంతో ఇంతో హింసచేస్తూనే ఉన్నారు. అయితే కొందరు చేసే హింసను మట్టుకే హింస అంటున్నారు. కొందరు చేసే దొంగతనాన్ని మటుకే దొంగతనం అంటున్నారు. కొందరు

---

**'తుపాకులతో అధికారం చలాయిద్దామని ప్రయత్నిస్తున్న ముఠాల అగాచకాలను సాగనివ్వం'**

**– హోంమంత్రి మైసూరారెడ్డి**

*చాలా మంచి నిర్ణయం. కానీ ఇది కడప జిల్లాలోని తమవారి ముఠాలకు కూడ వర్తిస్తుందా హోం మంత్రిగారు? రాజశేఖర రెడ్డి, దివాకర రెడ్డి, వెంగళరెడ్డి, శివారెడ్డి, శేషశయన రెడ్డి, నాగిరెడ్డి, రామకృష్ణా రెడ్డి, ప్రతాప రెడ్డి ఆదిగాగల రాయలసీమ కాంగ్రెస్ – తెలుగు దేశం నాయకుల ముఠాలకు కూడ వర్తిస్తుందాండీ?*

**'నేను కోర్టు ముందు ముద్దాయిగా నిలబడితే పోలీసు యంత్రాంగం ఆత్మ స్థైర్యం దెబ్బతింటుంది'**

**– గుంటూరు రేంజి డి ఐ జి అరవిందరావు (హైకోర్టులో)**

*ఈ మహానుభావుడిని కోర్టు ధిక్కార నేరానికి జైలుకు పంపించేపాటి ఆత్మగౌరవం హైకోర్టుకు లేకుండపోయింది. ఇంక ప్రజలకు కోర్టులంటే గౌరవం పోయిందని నిందించడం ఎందుకు?*

**'పోలీసులు గురుతరమయిన బాధ్యత నిర్వహిస్తున్నారు. వాళ్లను ఎక్కువగా విమర్శించవద్దు. మొదటి తప్పును క్షమించండి'**

**– కేంద్ర హోం మంత్రి చవాన్**

*నేరాలను అరికట్టడం కోసం పోలీసు యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాం. అది ఇవ్వాళ దేశంలో 'గురుతరమయిన బాధ్యతలు' నిర్వహించే స్థితికి వచ్చిందంటే మీకు సిగ్గనిపించడం లేదా? వాళ్ల పరిధిలో లేని రాజకీయ కర్తవ్యాలు వాళ్లకు అప్పచెప్పింది చాలక వాళ్ల ఆగడాలను క్షమించమని ప్రజలను అడుక్కుంటున్నారా?*

## అతి పెద్ద 'ఎన్‌కౌంటర్' పగిడేరు – అతి బూటకపు ఎన్‌కౌంటర్

ఒకే ఒక 'ఎన్‌కౌంటర్'లో అయిదు మంది చనిపోయిన సంఘటనలు చాలానే జరిగాయి. ఎమర్జెన్సీ తరువాత కాలంలో వెంకట్రావు పేట (1985), బూరుగుపాకల (1985), గుంటువాని పాలెం (1989), అహమ్మదీపూర్(1991), కాచినపల్లి (1991), తులసిపేట (1991) 'ఎన్‌కౌంటర్ల'లో అయిదుగురు చొప్పున చనిపోయారు.

ఆ 'రికార్డు' ఇప్పుడు పాతబడిపోయింది. ఒకే ఒక్క 'ఎన్‌కౌంటర్'లో 13 మంది చనిపోయిన సంఘటన ఖమ్మం జిల్లా మణుగూరు మండలంలోని రామాంజారం గ్రామ శివారులో 1992 జనవరి 6వ తేదీన జరిగింది. దీనికి పోలీసులు కావాలనే 'పగిడేరు ఎన్‌కౌంటర్' అని పేరు పెట్టారు. పగిడేరు రామాంజారం గ్రామ పంచాయితీలోని ఒక హామ్లెట్. 'ఎన్‌కౌంటర్' జరిగిన స్థలం పగిడేరు కన్నా రామాంజారానికే దగ్గరయినా పగిడేరుకు రెండు దశాబ్దాలుగా నక్సలైట్ రాజకీయాలతో సన్నిహిత సంబంధం ఉంది కాబట్టి 'ఎన్‌కౌంటర్' పగిడేరు దగ్గర జరిగిందని ప్రకటిస్తే అది నిజమయిన ఎన్‌కౌంటరని ప్రజలు నమ్ముతారని భావించి పోలీసులు ఆ పేరు పెట్టారు.

వరంగల్ జిల్లా జనగాంలో జనవరి 5వ తేదీన బయిలుదేరి భద్రాచలం వైపు వ్యాన్‌లో పోతున్న 13 మందిని పోలీసులు దారిలో అరెస్టు చేసారు. అందులో 11 మంది వరంగల్ జిల్లాలోని వివిధ గ్రామాలకు, ఒకరు నిజామాబాద్ జిల్లాకు, ఒకరు నల్గొండ జిల్లాకు చెందినవారు. 12 మంది పురుషులు, ఒక మహిళ. వాళ్ల దగ్గర పీపుల్స్‌వార్ గ్రూపు కరపత్రాలు, పోస్టర్లు, కొత్త బ్యాగ్‌లు, కొత్తగా కుట్టిన సాయుధ దళం యూనిఫారాలు ఉన్నాయి. ఒక్క రివాల్వర్ తప్ప వేరే ఆయుధాలు లేవు. దానిని కూడ ఉపయోగించే అవకాశం వాళ్లకు దక్కలేదు.

అరెస్టు చేసిన వ్యక్తులను పోలీసులు జనవరి 6వ తేదీ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో మణుగూరు – ఏటూర్ నాగారం రోడ్డుకు ఎడమ పక్కన ఒకటిన్నర కిలోమీటరు దూరం అడవి బాట మీదుగా తీసుకుపోయారు. బలవంతంగా యూనిఫారాలు తొడిగించారు. నిలబెట్టి అందరినీ కాల్చేసారు. సాయంత్రం 5-15 నుండి దాదాపు 45 నిముషాల సేపు రామాంజారం గ్రామ ప్రజలకు కాల్పులు వినపడ్డాయి. అందరినీ చంపేసిన తరువాత పోలీసులు ఆలోచించి కథ తయారు చేసుకున్నారు. 7-00 గంటల ప్రాంతంలో తామే బాంబు పెట్టి అడవిలోని రోడ్డు కొంత పేల్చేసారు. ఈ శబ్దం కూడ పరిసర గ్రామాల ప్రజలు విన్నారు. ఆ తరువాత రాత్రి 11 గంటల దాకా అడపా దడపా పోలీసులు ఊరికే గాలిలోకి కాల్పులు జరుపుతూ ఉన్నారు. నక్సలైట్లు పోలీసుల జీపును పేల్చివేయడానికి మందుపాతర పెట్టారనీ, పోలీసులు ప్రమాదం నుండి తృటిలో తప్పించుకొని ఎదురు కాల్పులు జరిపారనీ అన్నారు. ఆరేడు గంటలు కాల్పులు జరపగా 13 మంది 'తీవ్రవాదులు' చనిపోయారన్నారు. ఇటు 300, అటు 200 రౌండ్లు కాల్పులు జరిగినా పోలీసులెవ్వరికీ ఏమీ కాలేదన్నారు. 'మందు పాతర' పేలిన చప్పుడు కంటె దాదాపు రెండు గంటలు ముందే కాల్పులు ప్రారంభం ఎట్లా అయ్యాయో పోలీసులు వివరించలేదు.

మృతులు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను మూడు రోజులు తమతో ఉంచుకొని 9వ తేదీ రాత్రి వ్యాన్ డ్రైవర్‌ను చంపేసి వ్యాన్‌ను భద్రాచలం అవతల తులసిపాక దగ్గర రోడ్డు పక్కకు తోసేసి 'ప్రమాదంలో డ్రైవర్ మరణించాడు' అని ప్రకటించారు.

దానితో పగిడేరు మృతుల సంఖ్య 14 అయింది.

**నక్సలైట్లతో సంబంధాలున్నాయనే నెపంతో పోలీసులు విలేఖర్ల మీద దాడి చేయడం గులాం రసూల్ హత్యతో ప్రారంభం కాలేదు. *1990–91* సంవత్సరాలలో *8* మంది మండలస్థాయి విలేఖర్ల మీద పోలీసులు తప్పుడు కేసులు పెట్టారు. ఇంట్లో బాంబులున్నాయనీ, టెర్రరిస్టు చర్యలకు సహకరిస్తున్నారనీ, హత్యలు చేయిస్తున్నారనీ కేసులు పెట్టారు. కొందరిని తీవ్రంగా చిత్రహింసలు పెట్టారు. వాళ్ల పేర్లు, ఊళ్లు:**

| | |
|---|---|
| *సోలిపేట రామలింగారెడ్డి* | *('ఉదయం' దుబ్బాక మండలం మెదక్ జిల్లా)* |
| *చాట్ల మురళీకృష్ణ* | *('ఈనాడు' మహాముత్తారం మండలం కరీంనగర్ జిల్లా)* |
| *తెలుగు సంజీవ్ కుమార్* | *('ఈనాడు' చినచింతకుంట మండలం మహబూబ్‌నగర్)* |
| *వీరబోయిన యాదగిరి* | *('ఈనాడు' మెదక్ మండలం మెదక్ జిల్లా)* |
| *నరాల రమణయ్య* | *('ఈనాడు' ఇచ్చోడ మండలం ఆదిలాబాద్ జిల్లా)* |
| *ఎస్. సత్య సుదర్శనం* | *('ఆంధ్రభూమి' కోరుకొండ మండలం తూ.గోదావరి జిల్లా)* |
| *బి.వి. శ్రీనివాసరావు* | *('ఈనాడు' దాచేపల్లి మండలం గుంటూరు జిల్లా)* |
| *తమటం శ్రీనివాసగౌడ్* | *('ఆంధ్ర ప్రభ' కొల్లాపూర్ మండలం మహబూబ్‌నగర్ జిల్లా)* |

*వీళ్లంతా చేసిన నేరం? పోలీసు అత్యాచారాలు గురించి వార్తలు రాయడం. 'నక్సలైట్ల' ఏరివేతలో పోలీసులకు సహకరించకపోవడం. అందుకోసం తమ వృత్తి ధర్మాన్ని వంచించకపోవడం.*

చేసే హింసను విధినిర్వహణ అంటున్నారు. మరికొందరు హింసచేసి పెద్దమనుషులు అవుతున్నారు, నాయకులవుతున్నారు. కొన్ని రకాల దొంగతనాలు చేసినవాళ్లు మటుకే జైలుకు పోతున్నారు. తక్కినవాళ్లు అసెంబ్లీకి, పార్లమెంటుకి పోతున్నారు. కొందరు నేరస్తులు పేదరికంలోనే చస్తున్నారు. కొందరు కోటీశ్వరులవుతున్నారు. రాజకీయపోషణ, కళాపోషణ చేస్తున్నారు.

ఈ ద్వైవిధ్యాన్ని గురించి ఆందోళన చెందే సంఘం మాది. అసమానత, అణచివేత, పేదరికం, అస్వతంత్రత ఉన్నంతకాలం దానికి ప్రతిఘటన ఉంటుంది. ఆ ప్రతిఘటన రకరకాల రూపాలలో ముందుకు వస్తుంది. ఆ రూపాలు మనకు నచ్చుతాయో లేదో ఎవరికి వాళ్లు నిర్ణయించుకోవచ్చును. అయితే అన్యాయాన్ని నిర్మూలించడానికి ఏరోజూ వీసమెత్తుకూడ కృషిచేయని వాళ్లు మమ్మల్ని పట్టుకొని ప్రతిఘటనను ఖండించమంటే మేము ఖండించము. ప్రజాస్వామ్యాన్నీ శాంతినీ భద్రతనూ నిజంగా కాంక్షించేటట్టయితే అవి ఎందుకు లేకుండ పోయాయో ఆలోచించమంటున్నాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత ఉన్న కోర్టులూ పత్రికలూ మేధావులూ మొదటినుండీ ఆ పనిలో నిజాయితీగా నిమగ్నమయి ఉంటే ఇవ్వాళ మమ్మల్ని దూషించే పరిస్థితి ఏర్పడేదే కాదంటున్నాం. భారత ప్రజాస్వామ్యం రోజు రోజుకు దిగజారుతూ ఉంటే సమాజంలోని పెద్దమనుషులందరూ చూస్తూ ఊరుకున్నారు. దానినుండి తను వంతుగా కొందరు లాభమూ పొందారు. ఇప్పుడు 'హింస ఎవరు చేసినా ఒక్కటే, సమానంగా ఖండించాలి' అని మాకు హితవు చెప్పి ఏం ప్రయోజనం? సర్చి వారంట్లనూ హెబియస్‌కార్పస్ పిటిషన్లనూ పోలీసులు అపహాస్యం చేస్తుంటే కోర్టులు దానిని కనీసం తమ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయంగా కూడ తీసుకోలేదు. భూస్వాములు పేదవాళ్ల భూములు ఆక్రమించుకోవడానికి ఇంజంక్షన్‌లూ ఎవిక్షన్ ఆర్డర్లూ తీసుకుంటుంటే ఇది అన్యాయం అని కోర్టులు అనుకోలేదు. ఇప్పుడు ప్రజలకు న్యాయవ్యవస్థ మీద నమ్మకం పోయి నక్సలైట్ల ప్రజాకోర్టులను ఆశ్రయిస్తున్నారని వాళ్లను తప్పుపట్టి ఏం ప్రయోజనం? వీధి రౌడీలు మంత్రులూ, ముఖ్యమంత్రులూ అయికూర్చున్నప్పుడు పత్రికాసంపాదకులూ మేధావులూ వారి అర్హతను ప్రశ్నించలేదు. వాళ్ల హంతక ముఠా తగాదాలకు 'అసమ్మతి రాజకీయం' అనే అందమయిన పేరుపెట్టి వార్తలూ వ్యాఖ్యలూ రాస్తున్నారు. ఇప్పుడు హింసా రాజకీయాల గురించి నక్సలైట్లకు నైతిక ఉపదేశాలు చేసి ఏం ప్రయోజనం? కేంద్రప్రభుత్వం కాశ్మీర్ ప్రజల ప్రియతమ నాయకుడయిన షేక్ అబ్దుల్లాను 1953లో అబద్ధపు ఆరోపణలతో అరెస్టుచేసి రెండు దశాబ్దాలకు పైగా ఆయనకు రాజకీయ స్వేచ్ఛ లేకుండా చేసినప్పుడు, కాశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినప్పుడు ఎవ్వరూ తప్పుపట్టలేదు. ఇప్పుడు వేర్పాటువాదం ప్రబలిపోయిందంటూ 'ఏక్తా యాత్రలు' చేసి ఏం ప్రయోజనం?

రాజీవ్‌గాంధీ హయాంలో కేంద్రప్రభుత్వమే తమిళనాడులో ఎల్‌టిటిఇకి స్థావరాలు కల్పించింది. సైనిక శిక్షణ ఇప్పించింది. ఎల్‌టిటిఇతో స్నేహంగా ఉంటే తప్పేమీ లేదన్న భావాన్ని తమిళప్రజలలో కల్పించింది. ఆ తరువాత తన విధానాన్ని మార్చుకొని ఎల్‌టిటిఇని అణచడానికి శ్రీలంక ప్రభుత్వానికి సైనిక సహాయం అందజేసింది. దానికి ప్రతీకారంగా ఎల్‌టిటిఇ రాజీవ్‌గాంధీని శ్రీపెరంబుదూర్‌లో హత్యచేస్తే ఇప్పుడు తమిళ ప్రజలనందరినీ నేరస్తులను చేసి వందల సంఖ్యలో అరెస్టు చేసి 'టాడా' కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. ఇది కుటిల రాజకీయం అని దేశంలోని మేధావులూ పత్రికా సంపాదకులూ నోరువిప్పి అనలేకపోతున్నారు. తమిళయువకులకు భారత ప్రజాస్వామ్యం మీద విశ్వాసం పోతే, తామూ కాశ్మీర్ పంజాబ్‌ల మార్గం పడితే దానికి రేపు వాళ్లను నిందించి ఏం ప్రయోజనం?

ఈ ప్రశ్నలు ఎవరో ఒకరు అడగనవసరం లేదా? మేము అడిగితే తప్పా?

మరి మామీద ఈ దాడులెందుకు?

అయితే ఉద్యమకారులు ఏంజేసినా మీరు ఖండించరా అని అడుగుతారు. వాళ్ల సామాన్య ప్రజలకూ అమాయకులకూ హాని కలిగించే చర్యలకు పాల్పడితే ఖండిస్తాం. ప్రజల పట్ల మాకు బాధ్యత ఉంది కాబట్టి ఖండిస్తాం. ఇతర చర్యల మీద కేసులు పెట్టుకోండి, విచారించండి, చట్టబద్ధంగా శిక్షించండి అంటాం. మమ్మల్ని ఒక అనధికార పోలీసు యంత్రాంగంగా పనిచేయమని ఒత్తిడి చేయవద్దని అంటాం. మేమున్నది వ్యవస్థ చేసే నేరాల మీద నిఘా వేయడానికని అంటాం.

ఇది తప్పా?

వ్యవస్థ దృష్టిలో ఇదే తప్పు. అందుకే మామీద ఈ దాడులు. నిజాయితీగా మాట్లాడుకుంటే ఇవాళ మన దేశాన్ని ఏలుతున్న వాళ్లంతా హంతకులు, దొంగలు. ప్రజాస్వామ్యంలో అధికారం చేపట్టడానికి కనీస అర్హత లేనివాళ్లు. దేశ సంపదను తమలో తాము పంచుకోవడానికి వాళ్లకు ప్రజాస్వామ్యం పనికొచ్చింది. దేశాన్ని దోచుకుంటున్నారు. పంచుకుంటున్నారు. ఈ దోపిడీకి పోలీసు వ్యవస్థ అండగా నిలబడింది. ధనవంతులూ బలవంతులూ మన ప్రజాస్వామ్యాన్ని స్వంతం చేసుకొని రౌడీల సహాయంతో పోలీసుల సహాయంతో మనల్ని ఏలుతున్నారు. ఈ పరిపాలనను ఈ పరిపాలనలో వర్ధిల్లుతున్న అన్యాయాన్ని మేము ప్రశ్నిస్తున్నాం. 'మా అంతటి వారు నేరాలు చేస్తుంటే వీళ్లెవ్వరు ప్రశ్నించడానికి?' అని పాలకులకు మామీద కోపం.

అధికారం చేతిలో ఉన్నవాళ్ళు ప్రశ్నించేవాళ్ళను సహించరు. దాడిచేస్తారు, కొడతారు, అరెస్టు చేస్తారు, చంపుతారు. అది వాళ్ళ నైజం. కానీ ప్రశ్నించే హక్కునూ విమర్శించే హక్కునూ కాపాడుకోకపోతే నష్టపోయేది కొద్దిమంది పౌరహక్కుల ఉద్యమకారులు మాత్రమేకాదు. ప్రజలంతా నష్టపోతారు. మన ప్రజాస్వామ్యం నష్టపోతుంది. దానిని ఇవ్వాళ కాపాడుకోకపోతే రేపు రాబోయే కాలంలో మన జీవితాలను బాగుచేసుకోవడం అసాధ్యమైపోతుంది. ధరలు పెరుగుతాయి, నిరుద్యోగం పెరుగుతుంది, సంపన్నులకూ పేదలకూ మధ్య అంతరాలు పెరుగుతాయి. బలహీనులమీద బలవంతుల దౌర్జన్యాలు పెరుగుతాయి. వీటిని ప్రతిఘటించాలంటే మనకు కనీస హక్కులు కావాలి. కనీస ప్రజాస్వామ్యం కావాలి. వాటి స్థానంలో గుండా రాజ్యాన్నీ పోలీసు రాజ్యాన్నీ ప్రవేశపెడుతుంటే మనం ఇవ్వాళ చూస్తూ ఊరుకోవడం మనకు మనమే ద్రోహంచేసుకోవడం అవుతుంది.

- పోలీసు రాజ్యాన్ని ప్రతిఘటిద్దాం
- ప్రజాస్వామిక విలువలను కాపాడుకుందాం.
- పౌరహక్కుల ఉద్యమాన్ని కాపాడుకుందాం.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
(APCLC)

ఫిబ్రవరి 1992

| | | |
|---|---|---|
| ప్రచురణ | : | ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం |
| | : | ఫిబ్రవరి 1992 |
| వెల | : | 2 రూ. |
| ప్రతులకు | : | ఎస్.ఎస్.సి.బోస్ |
| | | డా. రామనాథం ఛాంబర్ ఆఫ్ లా |
| | | పెద్దిబొట్లవారి వీథి, గవర్నర్‌పేట |
| | | విజయవాడ - 520 002. |

# పౌరహక్కుల ఉద్యమం అంతర్జాతీయ ఉద్యమం

మేము చెప్పున్నవి కేవలం ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం అభిప్రాయాలు కావు. అంతర్జాతీయ పౌరహక్కుల ఉద్యమం అభిప్రాయాలు.

మనదేశంలోని అన్ని రాష్ట్రాలలో పౌరహక్కుల సంస్థలు ఉన్నాయి. అన్ని దేశాలలోనూ ఉన్నాయి. అన్ని పౌరహక్కుల సంస్థలూ అణచివేతకు వ్యతిరేకంగా పుట్టినవే. కొన్ని సామాజిక వర్గాలను లేక రాజకీయ ఉద్యమాలను ప్రజాస్వామిక విలువలకు వ్యతిరేకంగా అణచివేస్తుంటే దానికి స్పందించి ప్రజాస్వామిక విలువలను నిలబెట్టడం కోసం ఏర్పడ్డాయి పౌరహక్కుల సంస్థలు.

అమెరికాలో ఈ శతాబ్దం రెండవ దశకంలో కమ్యూనిస్టు భావాలు కలవాళ్లను ప్రభుత్వం వేటాడి అరెస్టు చేసి కేసులలో ఇరికించింది. రాజకీయ స్వేచ్ఛను నిరాకరించడం, తప్పుడు కేసులలో ఇరికించడం అన్యాయమంటూ పుట్టింది అమెరికా పౌరహక్కుల సంఘం (ఏసిఎల్‌యు). చైనాలో 1926లో షాంగై తిరుగుబాటును ప్రభుత్వం పాశవికంగా అణచివేసిన తరువాత రైతాంగ ఉద్యమకారులనూ కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరులనూ ఏరివేస్తుంటే అందుకు నిరసనగా ఏర్పడింది చైనా లీగ్ ఫర్ సివిల్ రైట్స్. బ్రిటన్‌లో 1930లో తీవ్రంగా నెలకొన్న నిరుద్యోగం, ఆకలి, దారిద్ర్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన కార్మిక వర్గాన్ని ప్రభుత్వం పాశవికంగా అణచివేస్తుంటే అందుకు నిరసన తెలుపుతూ, ఉద్యమించే హక్కుకు మద్దతుగా ఏర్పడింది బ్రిటిష్ జాతీయ పౌరహక్కుల సమితి (ఎన్‌సిసిఎల్). భారత జాతీయ ఉద్యమాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధాజ్ఞలూ, లాఠీచార్జీలూ, కాల్పులతోనూ, రాజద్రోహం కేసులతోనూ అణచివేయాలని చూసినప్పుడు దానిని ప్రతిఘటించడానికి కాంగ్రెస్ పెద్దల సారధ్యంలో పుట్టింది భారత పౌరహక్కుల సంస్థ. దీనికి నెహ్రూ, రవీంద్రనాథ్ టాగూర్, రాంమనోహర్ లోహియా వంటివారు నాయకత్వం వహించారు. సోవియట్ రష్యా, తూర్పు యూరప్, చైనా తదితర దేశాల కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాలు తమ విధానాల పట్ల అసమ్మతి తెలిపే హక్కును నిరాకరించి అసమ్మతి వాదులను అణచివేతకు గురిచేసినప్పుడు దానికి నిరసనగా ఒక్కొక్క దేశంలోనూ పౌరహక్కుల సంస్థలు ఏర్పడ్డాయి. వాటిలో పేరుపొందినది జెకోస్లావేకియాకు చెందిన 'చార్టర్ ఆఫ్ 77'. దక్షిణ అమెరికా దేశాల సైనిక నియంతల రాక్షసపాలనకు వ్యతిరేకంగా అన్ని దేశాలలోనూ పౌరహక్కుల సంస్థలు ఏర్పడ్డాయి. అమెరికాలోనూ, దక్షిణ ఆఫ్రికాలోనూ నల్లజాతివారు తమనసలు పౌరులుగా గుర్తించే లేదంటూ ఉద్యమాలతో ముందుకొచ్చారు.

అణచివేతకు వ్యతిరేకంగా ఏర్పడిన పౌరహక్కుల సంస్థలు కాలక్రమంలో తమ పరిధిని అవగాహననూ విస్తరించుకొని ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నాయి. అంతర్జాతీయమయిన ఈ ఉద్యమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంకూడ అదే కృషి చేస్తూ ఉంది.